



దరహాసం : అభిమానులను చూస్తూ పవన్ ఆనందం



మా పవర్ స్టార్ : పవన్‌కు వేగుళ్ల పుష్పగుచ్ఛం

వైసీపీకి పొలిటికల్ హాలిడే ప్రకటించండి!



ఆలోచించి ఓటేయండి : మండపేట సభలో అభిమానులకు పవన్ పిలుపు

మండపేట, మే 1 : కోనసీమలో క్రాప్‌హాలిడే ప్రకటించినట్టుగా వైసీపీకి ఈ ఎన్నికల్లో పొలిటికల్ హాలిడే ప్రకటించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట కేపీరోడ్డులో బుధవారం అమలాపురం ఎంపీ టీడీపీ అభ్యర్థి హరీష్ మాధుర్, మండపేట అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల సభలో మండుటెండలో పవన్ గంటపాటు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంపైన, వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు అక్రమాలపైనా విరుచుకుపడ్డారు. ఇక్కడ 50 రైస్‌మిల్లులు ఉన్నాయి. కానీ రైతులు నష్టాల్లో ఉన్నారు. వైసీపీ నాయకులు అమ్మకాలు సాగించే గంజాయికి మాత్రం గిట్టుబాటు ధర ఉంది. వేలకోట్ల అమ్మకాలూ సాగుతాయి. సినిమా టిక్కెట్లకు అధికారులు వస్తారు.. కానీ గంజాయి నిర్మూలనకు రారని ధ్వజమెత్తారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా రైతులకు మద్దతు ధర ఇవ్వలేదు. మూడు వేల మంది రైతులు చనిపోయారు. వ్యవసాయంలో రాయితీలు తీసేశారు. ఈ రోజున ఎందుకు ఇవ్వడం లేదని అడిగితే దాడులు తప్ప సమాధానం లేదు. 2020లో హుద్‌హుద్ తుఫాన్ కారణంగా రూ.250 కోట్ల మేర పంటనష్టం వాటిల్లినా పరిహారం ఇవ్వలేదు. తెలంగాణలో వరిసాగు పెరుగుతుంటే అన్నపూర్ణ ఆంధ్రలో మాత్రం వరి సాగు తగ్గింది. మద్దతు ధర ఇవ్వరు.. చివరకు రైతులిక్కడ క్రాప్‌హాలిడే ప్రకటించాల్సి వచ్చింది. దీనికి సమాధానంగా వైసీపీకి రాష్ట్రవ్యాప్తంగా పొలిటికల్ హాలిడే ఇవ్వాలని పవన్ పిలుపునిచ్చారు. జగన్‌కు నెలకు పది కోట్లు వంతున కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి కేదార్లంక ఇసుక ర్యాంపుల నుంచి వెళ్లిందని ఆరోపించారు. అదే డబ్బుతో ఇప్పుడు ఓట్లు కొంటున్నాడన్నారు. జగన్.. ఇప్పుడు క్లాస్ వార్ అంటూ అందరినీ కలిపి దోచేయడం కాదు...సీఎం దోస్తున్నాడా. పవన్ దోస్తున్నాడా ప్రతి ఒక్కరూ ఆలోచించండి. ప్రకృతిలో పంచభూతాలు అందరివి. మేడే రోజున చెబుతున్నా.. సహజ వనరులపై అజమాయిషీ చేస్తే అధః పాతాళంలోకి తొక్కేస్తా..తోట త్రిమూర్తులుకూ చెబుతున్నా అంటూ పవన్ ధ్వజమెత్తారు. కూటమి అన్నదమ్ముల ను కలుపుతుంటే వైసీపీ మాత్రం జగన్ కుటుంబాన్ని విడదీస్తోందని పవన్ అన్నారు. కొత్తపేటలో బండారు బ్రదర్స్ ఇద్దరు వేర్వేరుగా ఉంటే.. వారిని కూటమి ఒక్కటి చేసిందన్నారు. జగన్ మాత్రం తన కుటుంబంలో చెల్లిని, తల్లిని విడదీస్తే తమ కూటమి అన్నదమ్ములను కలిపిందన్నారు. తనకు ఎవరిమీద ద్వేషం ఉండదన్నారు. కాపు కులం వాడుకున్న ఇక్కడి వైసీపీ అభ్యర్థి తోట కాపులకు చేసిందేమీ లేదన్నారు. ద్రాక్షారామలో దేవదాయ శాఖకు చెందిన భూమిని కాపు కమ్యూనిటీ హాల్ కోసం సేకరిస్తే ఆ భూమి తోట చేతుల్లోకి వెళ్లిందన్నారు. కాపు యువతనుద్దేశించి మాట్లాడుతూ మీరు పాతతరంలాగా మోసపోకండని హితవు పలికారు. రామచంద్రపురంలో 30 ఏళ్లపాటు శత్రువులుగా ఉన్న ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, తోట త్రిమూర్తులు కలవడం వారి అవకాశవాదానికి అద్దంపడుతోందన్నారు. ఈ ఇద్దరు నేతలు జొన్నాడ, యానాం మధ్య ఏటిగట్టును ఆధునీకరించడంలో ఎందుకు చొరవ చూపలేకపోయారని ప్రశ్నించారు. వారిద్దరూ రాజకీయ అవసరాలకు కలిశారు. తోట జనసేనలోకి రావడం లేదు. నాకు సంకేతాలు పంపలేదని పవన్‌కల్యాణ్ స్పష్టంచేశారు. మండపేటలో ఓ ప్రైవేటు పాఠశాలలో జరిగిన వివాదాన్ని ప్రస్తావిస్తూ కూటమి ఉంటే అలా జరుగుతుందా, కూటమి ప్రభుత్వం ఉంటే తాను తాట తీస్తానని పేర్కొన్నారు. వైసీపీ కాకినాడ సిటీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిలో మూడు పదవులు ఉన్నాయని, ఇప్పుడు వారే రైతులను దోచేస్తున్నారని ఆరోపించారు. కూటమి అభ్యర్థులకు ప్రజలు గెలిపించాలని పిలుపునిచ్చారు. వైసీపీని తరిమి తరిమికొట్టాలన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి కూటమి నేతలు, జనసేన ఇన్‌చార్జిలు వేగుళ్ల లీలాకృష్ణ, పోలిశెట్టి చంద్రశేఖర్, బండారు శ్రీనివాసరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్. నల్లమిల్లి వీర్రెడ్డి, బీజేపీ నేత కోటిపల్లి సాయిరాం, టీడీపీ నేత వి.సాయికుమార్‌బాబు, అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.



వీళ్లకే ఓటేయండి : వేదికపై పవన్‌తో అమలాపురం ఎంపీ అభ్యర్థి హరీష్, ఎమ్మెల్యే అభ్యర్థులు వేగుళ్ల, నల్లమిల్లి, బండారు, సుభాష్



- మండపేటలో పవన్‌కల్యాణ్ పిలుపు
- రైతులకు మద్దతు ధర లేదు..
- గంజాయికి మాత్రం ఉంది
- సహజ వనరులపై అజమాయిషీ చేస్తే తొక్కేస్తా
- వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుపైనా ధ్వజం
- తోట, పిల్లి కలయిక రాజకీయ అవకాశవాదం
- కూటమి అభ్యర్థులను గెలిపించండి

పవన్‌కు ఘనస్వాగతం

మండపేటలో జరిగిన బహిరంగ సభకు హెలికాప్టర్‌లో వచ్చిన జనసేనాని పవన్‌కల్యాణ్‌కు జనసేన, టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. మండపేట బైపాస్‌రోడ్డులో ఉన్న హెలిపాడ్ వద్ద పవన్‌కు మండపేట కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కొత్తపేట, రామచంద్రపురం, అనపర్తి కూటమి అభ్యర్థులు బండారు సత్యానందరావు, వాసంశెట్టి సుభాష్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం పవన్ బైపాస్ రోడ్డు నుంచి భారీ బైక్ ర్యాలీతో కలవపువ్వు సెంటరుకు చేరుకుని అక్కడ జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. సభ ముగిసిన తర్వాత నేతలు ఆయన విశాఖకు బయలుదేరి వెళ్లారు.





పెంచుకుంటూపోతాం.. ఇదా అర్థం..!?

ఆ చేత్తో ఇచ్చి.. ఈ చేత్తో దోపిడీ

ఇదే వైసీపీ సర్కారు సంక్షేమం మతలబు

ఐదేళ్లూ బాదుడే.. బాదుడు

- సామాన్య, మధ్యతరగతి వర్గాలన్నీ చిత్తు
- అందుబాటులో లేని నిత్యావసరాల ధరలు
- విద్యుత్ బిల్లులు, ట్రూఅప్ చార్జీల పేరిట భారం
- ఇంటి పన్ను, రిజిస్ట్రేషన్ చార్జీల్లోనూ అదే బాదుడు
- చివరకు చెత్త పన్ను పేరిటా నరకం

జగన్ పాలన ఐదేళ్లూ.. పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాలకు దినదిన గండమే. తెల్లారితే రోజునెలా నెట్టుకురావాలో అనే దిగులు.. ఆర్థికంగా నిత్యం నలిగిపోవడమే. నెల జీతంతోనో, కనీస వేతనంతోనో, రోజు కూలీతోనో బతుకుబండిలాగే గడిచిన అయిదేళ్లూ పడరాని పాట్లు పడ్డారు. రోజురోజుకు పెరిగిపోతున్న ధరలు ఓవైపు, ప్రభుత్వమే ఆ పన్ను ఈ పన్ను అంటూ పెంచడంతోపాటు విద్యుత్ చార్జీలు మొదలుకొని అన్ని రకాల చార్జీలను అమాంతం పెంచేయడం ఆయా వర్గాలను ఊపిరిసలపనివ్వలేదు. నిత్యావసర సరుకులు కొనాలంటే భయం.. కరెంటు బిల్లు వస్తే గుండెదడ.. ఇంటిపన్నులు, ఆస్తి పన్నులు, రిజిస్ట్రేషన్ల చార్జీలు.. చివరకు చెత్త పన్ను అంటూ బడుగుజీవుల కష్టాన్నీ పీల్చేసిన వైనాలు ఎన్నో. పెంచుకుంటూ పోతాం.. అని జగన్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ. అది సంక్షేమ పథకాలకే పరిమితం కాలేదు.. ఇలా ఎడాపెడా చార్జీలు, ధరల పేరిట ఆ జనం నుంచి మళ్లీ లాగేసిన సిత్రాలు చాలా ఉన్నాయి. అందులో కొన్ని...

ఇంధన ధరపై తగ్గేదేలే..

పిఠాపురం : ఒక్క మన రాష్ట్రంలోనే పెట్రో ధరలు భగ్గుమంటున్నాయి. 2019 మేలో లీటర్ పెట్రోల్ ధర రూ.79.07, డీజిల్ రూ.73 ఉండగా ప్రస్తుతం పెట్రోల్ రూ.109.31, రూ.97.17లకు పెరిగింది. దేశంలోనే ఈ ధరలు అధికం. రాష్ట్రంలో వివిధ రకాల పన్నులతో పాటు సర్ చార్జీలను విధించడంతో ధరలు అధికంగా ఉన్నాయి. పలు రాష్ట్రాలు పన్నులు తగ్గించినా రాష్ట్రంలో మాత్రం తగ్గించేందుకు వైసీపీ సర్కారు అంగీకరించలేదు. కాకినాడ జిల్లాకు చెంతనే ఉన్న యానాంలో పెట్రోల్ లీటరు ధర రూ.94.84 ఉండగా, డీజిల్ ధర 84.68గా ఉంది. అంటే మన రాష్ట్రంతో పోల్చుకుంటే అక్కడ లీటరు పెట్రోల్ రూ.14.47, డీజిల్ రూ.12.49 తక్కువగా ఉంది.

జనం ఆస్తి.. జగన్ పెత్తనం!

జగన్ సర్కారు వచ్చిన తర్వాత రిజిస్ట్రేషను చార్జీలను అమాంతంగా పెంచేసింది. ఈ ఐదేళ్లలో భూములు/స్థలాల ధరలు ఏకంగా 200 శాతానికి పైగా పెరిగిపోయాయి. మరోవైపు కార్డ్‌ప్రైమ్ పేరుతో జిరాక్స్ పత్రాలను హక్కుదారుడి చేతిలో పెట్టే పనికి తెరతీశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక క్రమం తప్పకుండా 'బాదుడు' మాత్రం బాదేశారు. 2020, 2022, 2023 మే నెలలో అర్బన్, రూరల్ ఏరియాల్లో అప్పటి వరకూ ఉన్న అధిక ధరలకు మరో 50 శాతం జోడించారు. అపార్ట్‌మెంట్లలో చదరపు అడుగుకు సుమారు 30 శాతం మేర అధికం చేశారు. జిల్లాల పునర్వవస్థీకరణ 2022 ఏప్రిల్‌లో జిల్లా కేంద్రాలతో పాటు డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ధరలను పెం చింది. ఆ తర్వాత 2023 జూన్ 1 నుంచి మళ్లీ భూములు, రిజిస్ట్రేషన్ల ధరలు పెంచుతూ ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయి. దీంతో ఐదేళ్ల కిందట రూ.10 వేలు ఉండే చదరపు గజం ప్రభుత్వ ధర ఇప్పుడు రూ.30 వేలకు చేరింది. మరోవైపు భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా ఆస్తి పత్రాలు ఒరిజినల్స్ ప్రభుత్వం వద్ద ఉంచుకొని జిరాక్స్ కాగితాలు హక్కుదారుడి చేతిలో పెట్టే బృహత్తర 'పథకాన్ని' జగన్ ప్రభుత్వం తెరపైకి తీసుకొ చ్చింది. కార్డ్‌ప్రైమ్ 2.0 పేరుతో కకావికలానికి తెరతీసింది. ఎన్నో ఏళ్లగా వస్తున్న పుస్తకంలో వేలిముద్రల విధానాన్ని తీసేసింది.డిజిటల్ రూపంలో సంతకంలో తేడా వస్తే భౌతికంగా నిరూపణకు అవకాశమే లేదు.ఎక్కడో విదేశాల్లో ఉంటూ ఇక్కడ మన బ్యాంకు అకౌంట్‌లో డబ్బులను సైబర్ నేరగాళ్లు దోచుకుపోతున్నారు.మరి భూములు/స్థలాల రిజిస్ట్రేషన్లలో డిజిటల్ సంతకాలనే నమ్ముకోవడంలో 'అంతర్యం'ఏమిటో జగన్ సర్కారుకెరుక. - రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి

'నిత్యావసరాలు'.. ఆకాశంలో..

పిఠాపురం, మే 1 : పప్పులు, ఉప్పులు, నూనెలు, మసాలా సరుకులు, పాలు ఇలా ప్రతి నిత్యావసర వస్తువు ధర ఆకాశమే హద్దుగా పెరిగిపోయాయి. అడ్డూఅదుపూ లేకుండా ధరలు పెరుగుతున్నా ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. బతుకు భారమై ప్రజలు అవస్థలు పడుతున్నా పట్టలేదు. మేము అధికారంలోకి రాగానే అధిక ధరలపై ఉక్కుపాదం మోపుతాం. ధరలన్నింటినీ నియంత్రిస్తాం. ఇది ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ చెప్పిన మాటలు. అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఏటా పెరుగుతూనే ఉన్నాయి. కొన్ని రకాల నిత్యావసరాలు 50 నుంచి 100 శాతం, మరి కొన్ని 100 నుంచి 300 శాతం వరకూ పెరిగాయి. ఉల్లిపాయల ధరలు కిలో రూ.230 వరకూ పెరిగినా చలనం కనిపించలేదు. టమాటాలు కిలో రూ.140కి పెరిగినా ప్రభుత్వం జోక్యం చేసుకోలేదు.ఐదేళ్ల కిందట కందిపప్పు ధర కిలో రూ.70-90 ఉండగా ఇప్పుడు రూ.200కి పెరిగింది. మినపప్పు ధర రూ.60 ఉండగా ప్రస్తుతం రూ.125, పెసరపప్పు రూ.70 నుంచి రూ.120, సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో గతంలో రూ.75 ఉండగా రూ.200 దాటి విక్రయించారు. ప్రస్తుతం రూ.120లు ఉంది. పెరగగా, పామాయిల్ రూ.55 నుంచి రూ.100కు పెరిగింది. బియ్యం సన్నరకం కిలో రూ.28 ఉండగా ఇప్పుడు రూ.56కి పెరిగింది. జీలకర్ర కిలో రూ.150 ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.600-700 వరకూ పెరగగా, వెల్లుల్లి రూ.100 నుంచి 350కి పెరిగాయి. పాలు, ఇతర నిత్యావసరాలు, కూరగాయలు సహా నిత్య జీవనంలో ఉపయోగపడే అన్ని వస్తువుల ధరలు భారీగా పెరుగుదల బాటలోనే ఉన్నాయి. అయినా ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వాటి నియంత్రణపై దృష్టి పెట్టలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

చివరకు చెత్త పన్ను పేరిటా బాదుడే

రాజమహేంద్రవరం సిటీ : రాజమహేంద్రవరం నగరం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు వాణిజ్య కేంద్రం. ఈ నగరం వైశాల్యం 44 చదరపు కిలోమీటర్లు.50 డివిజన్లు, 95 వేల నివాస గృహాలు, 20 వేల కమర్షియల్ భవ నా లతో నగరం విస్తరించి ఉంది.ఏటా పన్నుల రూపేణా రాజమహేంద్రవరానికి రూ.45 కోట్లు డిమాండ్ ఉంది. ఈ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న కమర్షియల్, రెసిడెన్షియల్ భవనాలు,వ్యాపార సముదాయాల పన్నులను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచివేసింది. పన్నులు చెల్లిస్తున్న వారి భవనాలను బట్టి ప్రతి ఏటా 0 నుంచి 15 శాతం అదనంగా పన్నులను పెంచారు. పన్నుల విధా నంలో 5,7,10,15 శాతం వరకూ పెంచుకుంటూపోయారు.దీంతో నివాస,వాణిజ్య పన్నుల భారం కూడా ప్రజలపై పడింది.రాష్ట్ర వ్యాప్తంగా పన్నులు పెంపు చేశారు. చివరకు చెత్త పన్ను పేరిట ఒక కొత్త పన్ను విధానాన్నీ వైసీపీ సర్కారు అమల్లోకి తెచ్చింది

విద్యుత్ చార్జీల మోత మోగించారు..

పిఠాపురం : వైసీపీ పాలనలో విద్యుత్‌చార్జీల మోత మోగించారు. బిల్లుల భారం మూడు రెట్లు పెరిగింది. సర్దుబాట్లు పేరుతో విధించిన సర్‌చార్జీలు ప్రజలకు షాక్‌ను ఇచ్చాయి. ఐదేళ్ల క్రితం నెలకు రూ.200-300 మధ్య వచ్చే విద్యుత్ బిల్లులు ప్రస్తుతం రూ.500నుంచి రూ.750 వరకూ వస్తున్నాయి. విద్యుత్ చార్జీలను ఐదేళ్లపాటు పెంచబోనంటూ ఎన్నికల ముందు ప్రకటించిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు షాక్ ఇచ్చారు. శ్లాబుల మార్పుతో మొదలు పెట్టి సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారం మోపారు. విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని ప్రజలపైకి నెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. దీనివల్ల ఒకే సమయంలో నాలుగు సర్దుబాటు చార్జీలను ప్రజలు చెల్లిం చారు. ఏకంగా విద్యుత్ చార్జీల శ్లాబుల సర్దుబాటు, వినియోగ చార్జీలు, సర్దుబాటు చార్జీలు కలుపుకుని బిల్లులు 300శాతంపైగా పెరగడం, పలుమార్లు తనిఖీల్లో లోడు అధికంగా ఉందంటూ చార్జీలు చెల్లించాలని బిల్లులతో కలిపి ఇవ్వడంతో చెల్లింపులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మూడు సార్లు రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేశారు..



సామాన్యుడు భూమి కొనుగోలు చేయలేని విధంగా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేశారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మూడు దఫాలు భూమి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచింది. అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో భూమి విలువ పది నుంచి 20 శాతానికి పెరిగింది.
- బీవీ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, న్యాయవాది, ముమ్మిడివరం

చెత్తపై పన్ను వేసిన ఘనత జగన్‌దే..



ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యుత్ చార్జీలు రెట్టింపు చేశారు. ఏకంగా 9 సార్లు చార్జీలు పెంచిన ఘనత జగన్‌దే. ఇంటి పన్ను, చెత్త పన్ను పెంచారు. ఇవి సామాన్యులకు పెనుభారంగా మారాయి. చెత్తపై పన్ను వేసిన ఘనత వైసీపీకే దక్కుతుంది.
- సుంకర శ్రీనివాస్, సీహెచ్ గున్నేపల్లి

ఇష్టానుసారంగా నిత్యావసరాల ధరలు పెంపు



నిత్యావసర ధరలపై నియంత్రణ లేక ఇష్టానుసారం పెరిగిపోతున్నాయి.గత టీడీపీ ప్రభుత్వంలో రూ.100లు ఉండే కందిపప్పు ప్రస్తుతం రూ.200 ఉంది. అన్ని ధరలు రెట్టింపు పెరిగిపోయాయి. సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
- కె.మంగాదేవి, గృహిణి, ముమ్మిడివరం

ఇంధన ధరల భారం మోపారు..



సామాన్యులపై ఇంధన ధరల భారం మోపారు. అన్ని రాష్ట్రాలు తగ్గించినా మన రాష్ట్రంలో మాత్రం తగ్గించలేదు.ఇంధనంపై రకరకాల పన్నులు విధించడంతో సామాన్యుడు తట్టుకో లేకపోతున్నారు. వినియోగదారులపై భారం పెరిగింది.
- గోదశి గణేష్, పళ్లవారిపాలెం, టీవీ మెకానిక్

వైసీపీ ప్రభుత్వంలో బాదుడే..బాదుడు



ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ప్రజలపై బాదుడే బాదుడు. నా ఊహ తెలిసిన తర్వాత ఇప్పటి వరకు చెత్తపై పన్ను కట్టడం తెలిదు. వైసీపీ ప్రభుత్వంలో మాత్రం చెత్తపై పన్ను వేశారు. దీనికి తోడు కరెంట్ బిల్లులు నిత్యావసర ధరలు పెంచేశారు. మళ్లీ ఇదే ప్రభుత్వం ఉంటే ఇక సామాన్యులు బ్రతకలేరు.
- చోడే రామచంద్రమూర్తి, మారేడుబాక, మండపేట మండలం

ఐదేళ్లలో అన్ని ధరలు భారీగా పెంచేశారు..



నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. పప్పులు, ఉప్పులు ఐదేళ్లలో భారీగా పెరిగాయి. వంట గ్యాస్, కరెంట్ బిల్లులు, చెత్తపై పన్ను ఇబ్బుముబ్బడిగా పెంచేశారు. వైసీపీ ప్రభుత్వంలో సామాన్యుడు బతకలేని పరిస్థితి.
- చల్లా నాగమణి, మండపేట

గృహ సామగ్రి ధరలు పెరిగాయి..



చిన్న ఇల్లు కట్టుకుందామంటే పెరిగిన గృహ సామగ్రి ధరలు చూసి వెనకడుగు వేయాల్సి వస్తుంది. ప్రభుత్వం ధరలు అదుపు చేయకపోతే గ్రామీణ ప్రాంత ప్రజలకు సొంతిళ్లు కూడా ఉండవు.
- సోముల ఉపేంద్ర, బి.కొత్తూరు, తునిరూరల్

ఇంటి పన్నులు అమాంతం పెంచేశారు..



గత ఐదేళ్లలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఒరిగిందేమీ లేదు. ఇంటిపన్ను పెంచేశారు. గతంలో ఇంటిపన్ను రూ.800లు చెల్లిస్తుంటే ఇప్పుడు ఏకంగా రూ.1150కు చేరింది.విద్యుత్ బిల్లులదీ ఇదే పరిస్థితి. కట్టలేకపోతున్నాం. గతంలో రూ.800 వస్తే నేడు రూ.1200 చెల్లిస్తున్నాం. ఇంట్లో ఏసీ కూడా లేదు.
- సీహెచ్ మధుకిరణ్, బి.కొత్తూరు, తునిరూరల్

ఐదేళ్లలో అన్ని ధరలూ పెంచేశారు..



గత ఐదేళ్లలో కూరగాయలు, కందిపప్పు, నూనె, మిర్చి ఇతర ధరలు పెరిగిపోతూనే ఉన్నాయి. గత ప్రభుత్వంలో నిత్యావసర సరుకుల ధరలు అదుపులో ఉండేవి.నేడు ధరలు పెరిగి అవస్థలు పడుతున్నాం.
- బి.నరేష్, తుని

నేడు హోం ఓటింగ్!

తొలి విడతకు అంతా సిద్ధం.. 8న మలివిడత.. 13నా ఓటేయొచ్చు

85 ఏళ్లు దాటినవారు, పీడబ్ల్యూడీ ఓటర్లకు ఇంటి వద్దే ఓటు చాన్స్

రాజమహేంద్రవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్‌లకు రాలేని స్థితిలో ఉన్న 85 ఏళ్లు దాటినవారు, పీడబ్ల్యూడీ ఓటర్లు హోంఓటింగ్ విధానంలో ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం ఉంది. తొలివిడతగా గురువారం, రెండో విడతగా ఈనెల 8న ప్రత్యేక బృందాలు ఆయా ఓటర్ల వద్దకు వెళ్లి ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తాయని తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. బుధవారం రాత్రి ఆమె ఒక ప్రకటన జారీచేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ఈ హోంఓటింగ్ ప్రకియ మొదలు పెట్టామన్నారు. జిల్లాలో హోం ఓటింగ్‌కు అంగీకరించిన వారు మొత్తం 1306 మంది ఉండగా, అందులో 85 ఏళ్లు దాటినవారు 648 మంది, పీడబ్ల్యూడీ ఓటర్లు 658 మంది ఉన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో ఈ విధానం కోసం 400 మంది సిబ్బందితో 69 బృందాలు ఏర్పాటుచేశామన్నారు. ఈ రెండు విడతల్లో ఓటు వినియోగించుకోకపోతే మే 13న కూడా ఓటుహక్కును వినియోగించుకోవచ్చన్నారు. హోంఓటింగ్ ప్రక్రియ అంతా వీడియో రికార్డింగ్ చేస్తామని జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత తెలిపారు. అనపర్తిలో 85 ప్లస్ ఓటర్లు 186, దివ్యాంగులు 222 ఉండగా, హోంఓటింగ్ కోసం 147 మందితో 21 బృందాలు ఏర్పాటుచేశారు. రాజానగరంలో 85 ప్లస్ 33 మంది, దివ్యాంగులు 67 మంది ఉండగా, వారికోసం 35 మందితో 7 బృందాలు ఏర్పాటు చేశారు. రాజమండ్రి సిటీలో 85 ప్లస్ 142 మంది, దివ్యాంగులు 65 మంది ఉండగా, వారికోసం 40 మందితో పది బృందాలు ఏర్పాటుచేశారు. రాజమహేంద్రవరం రూరల్‌లో 85 ప్లస్ 51మంది, దివ్యాంగులు 56 మంది ఉండగా, వారికోసం 30 మందితో 5 బృందాలు ఏర్పాటుచేశారు. కొవ్వూరులో 85 ప్లస్ 66 మంది, దివ్యాంగులు 66 మంది ఉండగా, వారికోసం 40 మందితో 8 బృందాలు ఏర్పాటుచేశారు. నిడదవోలులో 85ప్లస్ 130మంది, దివ్యాంగులు 145 మంది ఉండగా, వారి కోసం 72 మందితో 12 బృందాలు ఏర్పాటుచేశారు. గోపాలపురంలో 85ప్లస్ 40 మంది, దివ్యాంగులు 37 మంది ఉండగా, వారి కోసం 36 మందితో 6 బృందాలు ఏర్పాటుచేశారు. హోం ఓటింగ్ ప్రక్రియ అంతా వీడియో రికార్డింగ్ చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. కాగా హోంఓటింగ్‌కు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోనూ ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు తెలిపారు.

'గుర్తు'ంచుకోండి..

ఎట్టకేలకు జనసేన గాజుగ్లాసు గుర్తు వివాదానికి తెర - 4లో

న్యాయస్థానంలో కేసు దాఖలుతో స్పష్టత ఇచ్చిన ఎన్నికల సంఘం




అట్లుంటది జగన్‌తోని..!

వీక్లీ ఆఫ్‌లు మాయం

సామర్లకోట, మే1: పోలీసులకు వారాంతపు సెలవులు అమలు చేస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన జగన్ అధికారంలోకి రాగానే వాటిని అలా అమలుచేసి ఇలా తీసేసారు. సరిగ్గా నాలుగేళ్ల కిందట జూన్ 19న జిల్లాలోని పోలీసులకు వారాంతపు సెలవులు అమలు చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో తొలిరోజు సుమారు 62 మందికి మంజూరు చేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు శాఖలోని సివిల్, ట్రాఫిక్, ఏఆర్, ఇలా పలు విభాగాల పరిధిలో ఉన్న అన్ని స్టేషన్లలోనూ వారాంతపు సెలవుల చార్టులను సిద్ధం చేశారు. ఈ చార్టులో ఆ స్టేషన్ పరిధిలోని సిబ్బంది ఏ రోజు వారాంతపు సెలవు తీసుకోవాలన్న సమాలోచనలు పొందుపరిచారు. సెలవు లేని ఉద్యోగం ఏదైనా ఉందా అంటే అది పోలీసు ఉద్యోగమేనా అనుకునే రోజుల్లో వారంలో ఒకరోజు సెలవు అమలు చేస్తారని తెలిశాక పోలీసు సిబ్బందితో పాటు వారి కుటుంబసభ్యులు ఎంతో ఆనందించారు. అయితే వారిలో ఈ ఆనందం ఎక్కువ కాలం నిలవలేదు. రోజులు గడిచే కొద్దీ సిబ్బంది కొరత ఉంది. సెలవులు లేవంటూ అధికారులు వారాంతపు సెలవులను పక్కన పెట్టేశారు. దీంతో ప్రభుత్వ తీరుపై పోలీసు సిబ్బంది ఆగ్రహంతో ఉన్నారు.

ఒకే ఒక్కడు

- టంగుటూరి ప్రభుత్వాన్ని పడగొట్టిన మన్యం ఎమ్మెల్యే
- మద్య నిషేధ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన కారం బాపన్నదొర



బాపన్నదొర

(రంపచోడవరం): 1953లో ఆంధ్ర రాష్ట్ర అవతరణతో తొలి ముఖ్యమంత్రిగా టంగుటూరి ప్రకాశం పంతులు సారథ్యంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం ఒక్క ఓటు తేడాతో కూలిపోయింది అనే విషయం తెలుసా? ఆ ఒక్క ఓటు ఎవరిదో తెలుసా.. కారం బాపన్నదొర అనే గిరిజన ఎమ్మెల్యేది. ఇతను ఏజెన్సీ ప్రాంతంలోని ఎల్లవరం నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. తన హయాంలో ఎన్నో సంస్కరణలకు బీజాలు వేసిన టంగుటూరి సంపూర్ణ మద్య నిషేధానికి కూడా బీజం వేయాలని ప్రయత్నించారు. ఈ బిల్లు కోసం ఓటింగ్ చేపట్టారు. ఇక్కడి గిరిజన ఎమ్మెల్యే కారం బాపన్నదొర మాత్రం మద్య నిషేధ బిల్లును వ్యతిరేకించారు. గిరిజనులకు మద్యం సేవనం సంప్రదాయమని చెబుతూ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. ఈ ఒక్క ఓటుతో సదరు బిల్లు వీగిపోయింది. దీంతో సంపూర్ణ మద్య నిషేధాన్ని అమలు చేయాలన్న ప్రకాశం పంతులు తపనకు ఆ నాటి సంకీర్ణ ప్రభుత్వంలో మద్దతు లభించలేదు. దీంతో నిబద్ధత కలిగిన నేతగా ఆంధ్ర రాష్ట్రంలోని తొలి ప్రభుత్వం ఏర్పడిన 14 నెలలకే ప్రకాశం పంతులు తన ప్రభుత్వాన్ని రద్దు చేసుకున్నారు. దీంతో 1955లో మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. అయితే సదరు ప్రకాశం పంతులు ప్రభుత్వం పడిపోవడానికి కారణమైన కారం బాపన్నదొర కూడా గిరిజన ప్రతినిధిగా గిరిజన ప్రయోజనాల కోసమే పనిచేశారు. నిబద్ధత కలిగిన నాయకుడిగా ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ఆదర్శంగా నిలిచారు. సదరు బాపన్నదొర జీవించి ఉన్నంత కాలం ఎన్నికల్లో పోటీ చేస్తూనే ఉన్నారు.

ఆయన గుర్తుగా..
ఉపాధి కల్పనా కేంద్రం



అమలాపురం రూరల్, మే 1: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్‌లో మారుమూలన ఉన్న తాండవపల్లి గ్రామానికి చెందిన పరమట వీరరాఘవులు తొలుత సర్పంచ్‌గా, ఆ తర్వాత అల్లవరం ఎస్సీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఆయన చేపట్టిన మంత్రిత్వ శాఖ ఆధారంగా అమలాపురంలో ఉప ఉపాధి కల్పనా కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. వీరరాఘవులు 1978లో అల్లవరం ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీచేసి స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి చెందారు. 1981లో అమలాపురం సమితి ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన రాఘవులు అదే ఏడాది జరిగిన అల్లవరం అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అప్పటి ముఖ్యమంత్రి టి.అంజయ్యతో ఉన్న సాన్నిహిత్యంతో మత్స్య, ఉపాధి కల్పనా శాఖల మంత్రిగా పనిచేశారు. ఆ సమయంలోనే అమలాపురంలో ఉప ఉపాధి కల్పనా కార్యాలయాన్ని మంజూరు చేయించడంతో పాటు ఎందరో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత దక్కించుకున్నారు. 1983 అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెందిన రాఘవులు 1989 అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా అల్లవరం నుంచి గెలుపొందారు. తాండవపల్లి గ్రామం మీదుగా నేడు ఆర్టీసీ బస్సులు తిరగడం లేదు. అయితే ఆటోలు కూడా లేని ఆ రోజుల్లో ఆ గ్రామం మీదుగా ఎర్ర బస్సులను తిప్పించిన ఘనత రాఘవులుదే.

గుర్తుంచుకోండి

ఎట్టకేలకు జనసేన గాజుగ్లాసు గుర్తు వివాదానికి తెర

స్వతంత్ర అభ్యర్థుల గుర్తు మార్పునకు ఈసీ ఓకే

ఇండిపెండెంట్లకు గాజుగ్లాసు కేటాయింపుపై కేసు దాఖలవడంతో స్పష్టత ఇచ్చిన ఎన్నికల సంఘం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ ఎన్నికల గుర్తు అయిన గాజుగ్లాసుపై ఎట్టకేలకు వివాదం వీడింది. కూటమి అభ్యర్థులు పోటీచేసే స్థానాల్లో ఇండి పెండెంట్లుగా బరిలో ఉన్న అభ్యర్థులకు గాజుగ్లాసు గుర్తు కేటాయించిన వివాదానికి ఫుల్‌స్టాప్ పడింది. న్యాయ స్థానంలో కేసు దాఖలవడంతో ఎన్నికల సంఘం చివరకు వెనక్కు తగ్గింది. గుర్తులను మార్చుతూ ఆదేశాలు జారీచేసింది. దీంతో అధికార పార్టీ కుతంత్రం బద్దలైనట్టయింది. కాకినాడ పార్లమెంట్ పరిధిలో జగ్గం పేట, ప్రత్తిపాడు, పెద్దాపురం, కాకినాడ సిటీ నియో జకవర్గాల్లో ఇటీవల నామినేషన్ల ఉపసంహరణ అనం తరం బరిలో మిగిలిన అభ్యర్థుల్లో పలువురు ఇండి పెండెంట్లకు గాజుగ్లాసు గుర్తును కేటాయించడంతో వివాదం రేగింది. తాజాగా ఈ గుర్తులను ఈసీ మార్చి వేరే గుర్తులను ఇవ్వడంతో వివాదానికి ఫుల్‌స్టాప్ పడింది.

గ్లాసుతో గందరగోళం...

అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ఈనెల 29తో నియోజకవర్గాల్లో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. దీంతో రిటర్నింగ్ అధికారులు ఆయా నియోజకవర్గాల్లో మొత్తం ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాలను, వారికి కేటాయించిన ఎన్నికల గుర్తుతో అధికారిక పత్రం విడుదల చేశారు. అయితే ఇవి వివాదాస్పదమైంది. ప్రధానంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో కొండబాబు అనే స్వతంత్ర అభ్యర్థికి అధికారులు గాజుగ్లాసు గుర్తు కేటాయించారు. జగ్గంపేట నియోజకవర్గంలో ఇండిపెండెంట్‌గా బరిలో ఉన్న పాటంశెట్టి సూర్యకు, కాకినాడ సిటీ నియోజకవర్గంలో ఇండిపెండెంట్ అభ్యర్థి మునగాల సాయిగోపి, పెద్దాపురంలో ఇండిపెడెంట్ అభ్యర్థి కన్నయ్యకు గాజుగ్లాసు గుర్తు కేటాయించారు. దీంతో ఇది తీవ్ర దుమారం రేపింది. టీడీపీ, జనసేన పార్టీలు పొత్తులో భాగంగా ఈ ఎన్నికల్లో తమ అభ్యర్థులను నిలిపాయి. అందులోభాగంగా టీడీపీపోటీ చేసే స్థానంలో జనసేన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోంది. అయితే ఈపార్టీ గుర్తు ఈవీఎంలో కనిపించదు. తద్వారా జనసేన పార్టీ అభిమానులు, నేతలు, కార్యకర్తలు, ఇతర ఓటర్లు గాజుగ్లాసుకు బదులు పొత్తు కాబట్టి సైకిల్ గుర్తుకు ఓటువేయాలి. కానీ అధికారులు మాత్రం గాజుగ్లాసు గుర్తును ఇండిపెండెంట్ అభ్యర్థులకు కేటాయించడం దుమారం రేపింది. తద్వారా జనసేన ఓటు బ్యాంకు టీడీపీ అభ్యర్థికి మళ్లకుండా స్వతంత్ర అభ్యర్థికి పడే ప్రమాదం ఏర్పడింది. దీంతో ఆయా నియోజకవర్గాల టీడీపీ అభ్యర్థుల్లో ఆందోళన రేగింది. అధికార వైసీపీ ఎన్నికల కుట్రపై ఎక్కడికక్కడ టీడీపీ నేతల్లో ఆగ్రహం వ్యక్తమైంది. అయితే దీనిపై ఇటీవల రాష్ట్ర ఉన్నత న్యాయస్థానంలో కేసు దాఖలైంది. దీంతో ఎన్నికల సంఘం బుధవారం న్యాయస్థానం ముందు జరిగిన తప్పిదాన్ని అంగీకరించింది. గాజుగ్లాసు గుర్తుకు బదులు వేరే కొత్త గుర్తులు ఇస్తామని పేర్కొంది. దీంతో సమస్యకు ముగింపు లభించింది.

ఎట్టకేలకు మార్చారు..

ఈసీ ఆదేశాలతో తాజాగా కాకినాడ పార్లమెంట్ పరిధిలోని జగ్గంపేట ఇండిపెండెంట్ అభ్యర్థి అయిన సూర్యచంద్రకు గాజుగ్లాసు గుర్తుకు బదులు కొత్తగా 'గాజులు' చిహ్నం కేటాయించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో స్వతంత్ర అభ్యర్థి అయిన కొండబాబుకు గాజుగ్లాసుకు బదులు కొత్తగా ఇప్పుడు గ్యాస్ సిలెండర్ చిహ్నం కేటాయించారు. కాకినాడ సిటీ నియోజకవర్గ ఇండిపెండెంట్ అభ్యర్థి మునగాల సాయిగోపికి కొత్తగా నౌక గుర్తును కేటాయించారు. పెద్దాపురం ఇండిపెడెంట్ అభ్యర్థి కన్నయ్యకు బకెట్ గుర్తు కేటాయించారు. ఈ నేపథ్యంలో గుర్తుల వివాదం సమసింది. తాజా గుర్తులతో ఆయా ఇండిపెండెంట్లు ఎన్నికల బరిలో పోటీపడనున్నారు.

కోనసీమలో ఇలా..

అమలాపురం టౌన్, మే 1 : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో రెండు అసెంబ్లీ సీట్లు రాజోలు, పి గన్నవరంలలో జనసేన పోటీచేస్తోంది. మిగిలిన అమలాపురం, ముమ్మిడివరం, రామచంద్రపురం, కొత్తపేట, మండపేట నియోజకవర్గాల్లో మాత్రం ముందుగానే కేటాయించినట్టుగానే స్వతంత్ర అభ్యర్థులకు గాజుగ్లాసు గుర్తుపైనే పోటీ చేస్తారు.

గ్లాసు పోయి గ్యాస్ సిలిండర్ వచ్చే..

రాజమహేంద్రవరం, మే 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రీయ ప్రజాకాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసున్న మేడా శ్రీనివాస్ మొదట గాజుగ్లాస్ గుర్తు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. కానీ ఎన్నికల కమిషన్ ఈ గుర్తుకు సంబంధించి తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. ఏదైనా లోక్‌సభ పరిధిలో అసెంబ్లీ నుంచి జనసేన అభ్యర్థులు పోటీచేస్తుంటే అక్కడ లోక్‌సభ అభ్యర్థికి గాజుగ్లాసు గుర్తు కేటాయించకూడదు. ఆ మేరకు తొలుత గాజుగ్లాసు గుర్తు ఉన్న మేడా శ్రీనివాస్‌కు గ్యాస్ సిలిండర్‌ను గుర్తుగా కేటాయించారు.

ఒకే కుటుంబం
ముగ్గురు ఎమ్మెల్యేలు



కోర్పు అచ్చిమాంబ, కోర్పు వెంకట రామకృష్ణ



కోర్పు రామచంద్రరావు

కోరుకొండ, మే 1: కోరుకొండ మండలంలోని ఓ చిన్న గ్రామం నుంచి ఇప్పటికి ముగ్గురు ఎమ్మెల్యేలుగా పని చేశారు. వారందరు ఒకే కుటుంబం కావడం విశేషం. ప్రస్తుతం ఉన్న రాజానగరం నియోజకవర్గం 2009కు ముందు బూరుగుపూడి నియోజకవర్గంగా ఉండేది. అప్పట్లో 'కోర్పు' కుటుంబానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలుగా పని చేశారు. కోరుకొండ మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన కోర్పు రామచంద్రరావు 1972లో కాంగ్రెస్ పార్టీ తరుపున పోటీ చేసి విజయం సాధించి అసెంబ్లీకి వెళ్లారు. తదుపరి టీడీపీ ఆవిర్భవించిన తర్వాత 1994లో కోర్పు రామచంద్రరావు తమ్ముడు కోర్పు వెంకట రామకృష్ణ టీడీపీ తరపున పోటీ చేసి విజయం సాధించి అసెంబ్లీకి వెళ్లారు. తదుపరి 1999లో కోర్పు వెంకటరామకృష్ణ భార్య కోర్పు అచ్చిమాంబ టీడీపీ తరపున పోటీ చేసి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఈ విధంగా ఒకే కుటుంబానికి చెందిన కోర్పు రామచంద్రరావు, ఆయన తమ్ముడు కోర్పు వెంకట రామకృష్ణ, వెంకటరామకృష్ణ భార్య అచ్చమాంబ ఎమ్మెల్యేలుగా పనిచేశారు. వారిది ఒకే గ్రామం. ఒకే కుటుంబం కావడం విశేషం.

ప్రజల తీర్పు విలక్షణం

రాజోలు నియోజకవర్గం

రాజోలు నియోజకవర్గ ఓటర్లు తీర్పు విలక్షణంగా ఉంటుంది. రాజోలు నియోజకవర్గం ఆవిర్భవించిన తొలిరోజుల్లో కమ్యూనిస్టుల కంచుకోటగా ఉండేది. తర్వాత కాంగ్రెస్ హవా నడిచింది. టీడీపీ ఆవిర్భావంతో కాంగ్రెస్ ఆధిపత్యానికి గండి పడింది. ఒక దశాబ్ద కాలం పాటు అన్ని పార్టీలు అధికారాన్ని చెలాయించాయి. కాలక్రమంలో కమ్యూనిస్టులు బలహీనపడడంతో కాంగ్రెస్, టీడీపీ పార్టీలు పోటాపోటీగా తమ అధికారాన్ని దక్కించుకున్నాయి.

రాజోలు, మే 1:

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పటి నుంచి రాజోలు నియోజకవర్గం ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. 1937లో రాజోలు, అమలాపురం కలిపి ఒకే నియోజకర్గంగా ఉండేవి. ఈ ద్విసభ నియోజకవర్గం నుంచి ఒక జనరల్ అభ్యర్థి, ఒక రిజర్వుడు అభ్యర్థిని ఎన్నుకునే విధానం జరిగింది. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత 1952లో తొలి సాధారణ ఎన్నికలు జరిగాయి. అప్పట్లో రాజోలు నగరం కలిపి ఒకే నియోజకవర్గంగా ఏర్పడింది. కాంగ్రెస్ అభ్యర్థిగా జనరల్ స్థానానికి ముప్పర్తి వెంకటరత్నం, రిజర్వుడు స్థానానికి బోయి భీమన్న, ప్రకాశం ప్రజాపార్టీ తరఫున జనరల్‌కు ఆకుల బులిస్వామి, రిజర్వుడుకు పాములు వెంకటరత్నం పోటీ చేశారు. వారిపై కమ్యూనిస్టు పార్టీ నుంచి పోటీ చేసిన అల్లూరి వెంకటరామరాజు జనరల్‌లోను, గంజి నాగేశ్వరరావు రిజర్వుడు స్థానంలోను విజయం సాధించారు. మద్రాసు నుంచి ఆంధ్ర రాష్ట్రం విడిపోవడంతో టంగుటూరి ప్రకాశం పంతులు ముఖ్యమంత్రిగా ఉన్న ప్రభుత్వం ఒక్క ఓటు తేడాతో పడిపోవడం కారణంగా 1955లో మధ్యంతర ఎన్నికలు వచ్చాయి. ఇందుల్లోను కమ్యూనిస్టు పార్టీకి చెందిన అభ్యర్థులే మరలా విజయం సాధించారు. 1962వ సంవత్సరంలో ద్విసభ నియోజకవర్గాలు రద్దవడంతో రాజోలు అసెంబ్లీ నియోజకవర్గం రిజర్వుడుగా ఏర్పడింది. అప్పటికే రాజోలులో కమ్యూనిస్టు ప్రభావం బాగా తగ్గిపోవడంతో కాంగ్రెస్ పార్టీ ప్రాబల్యం పెరిగింది. 1972 ఎన్నికల్లో తొలిసారిగా ఇక్కడ స్వతంత్ర అభ్యర్థిగా రాజోలు మండలం తాటిపాక గ్రామానికి చెందిన బిక్కిన గోపాలకృష్ణారావు విజయం సాధించారు. 1958, 1966లో జరిగిన శాసనమండలి ఎన్నికల్లో సఖినేటిపల్లి మండలం గుడిమూలకు చెందిన రుద్రరాజు రామలింగరాజు ఎన్నికయ్యారు. 1967, 1971లో కాసు బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో రామలింగరాజు దేవాదాయశాఖ మంత్రిగా పనిచేశారు. 1985 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన టీడీపీ అభ్యర్థి రాజోలు మండలం చింతలపల్లికి చెందిన అల్లూరి వెంకట సూర్యనారాయణరాజు డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు.



అంతర్వేది ఆలయం

ప్రముఖ పుణ్యక్షేత్రం అంతర్వేది లక్ష్మీనర సింహస్వామి ఆలయం ఆధ్యాత్మిక పరిమళాలు వెదజల్లుతుంటే.. సాగర సౌందర్యం ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పిస్తోంది.. దిండి రిసార్ట్స్ పర్యాటకులను ఆకట్టుకుంటుంటే, లైట్ హౌస్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



కీలక పదవులు

ఈ సుదీర్ఘ పాలనలో కాంగ్రెస్ పార్టీ నుంచి విజయం సాధించిన రుద్రరాజు రామలింగరాజు దేవదాయశాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వహించారు. 1985లో సూర్యనారాయణరాజు డిప్యూటీ స్పీకర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రాజోలు నియోజకవర్గంలో మైనార్టీలుగా ఉన్న క్షత్రియులు 27 ఏళ్ల పాటు పరిపాలించారు. అధికంగా ఉన్న కాపు సామాజికవర్గం ఓటర్లు శెట్టిబలిజ, ఎస్సీలు, గెలుపోటములు నిర్ణయించడంలో కీలక పాత్ర వహిస్తారు. పునర్విభజన ఫలితంగా రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాలు పూర్తిగానూ, మామిడికుదురు మండలంలోని ఏడు గ్రామాలు రాజోలు నియోజకవర్గ పరిధిలోకి వచ్చాయి.



లైట్‌హౌస్


సంవత్సరం	విజేత	పార్టీ
1955	అల్లూరి వెంకటరామరాజు	సీపీఐ
1962	గెడ్డం మహాలక్ష్మి	కాంగ్రెస్
1967	నయినాల గణేశ్వరరావు	కాంగ్రెస్
1972	బిక్కిన గోపాలకృష్ణారావు	స్వతంత్ర
1978	రుద్రరాజు రామలింగరాజు	కాంగ్రెస్
1983	ఏవీ సూర్యనారాయణరాజు	టీడీపీ
1985	ఏవీ సూర్యనారాయణరాజు	టీడీపీ
1989	మంగెన గంగయ్య	కాంగ్రెస్
1994	ఏవీ సూర్యనారాయణరాజు	టీడీపీ
1999	ఏవీ సూర్యనారాయణరాజు	టీడీపీ
2004	అల్లూరు కృష్ణంరాజు	కాంగ్రెస్
2009	రాపాక వరప్రసాదరావు	కాంగ్రెస్
2014	గొల్లపల్లి సూర్యారావు	టీడీపీ
2019	రాపాక వరప్రసాదరావు	జనసేన

ఓటర్ల వివరాలు


నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 1,97,920 మంది ఉన్నారు. పురుషులు 97,807 మంది కాగా, మహిళా ఓటర్లు 1,00,112 ఇతరులు ఒకరు ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు మొత్తం 205 ఉన్నాయి.

రాజోలు రాజకీయ చరితం


నియోజకవర్గంలో 1972లో మాత్రం ఒక్కసారి స్వతంత్ర అభ్యర్థి బిక్కిన గోపాలకృష్ణారావు గెలుపొందారు. నాలుగు పర్యాయాలు టీడీపీ అభ్యర్థిగా విజయం సాధించి అల్లూరి వెంకటసూర్యనారాయణరాజు రికార్డు సృష్టించారు. 1952లో తొలిసారిగా ద్విసభ్య నియోజకవర్గంగా రాజోలుకు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థులు అల్లూరి వెంకటరామరాజు 41,847 ఓట్లు, గంటి నాగేశ్వరరావు 34,668 ఓట్లతో విజయం సాధించారు. 1955లో జరిగిన ఎన్నికల్లో మళ్లీ వారే కమ్యూనిస్టు పార్టీ తరపున గెలుపొందారు. 1962 వరకు కమ్యూనిస్టుల హవా సాగింది. ఆ ఏడాది ఏకసభ నియోజకవర్గంగా ఏర్పడి ఎస్సీలకు రిజర్వుడు చేశారు. కాంగ్రెస్‌పార్టీ తరపున పోటీ చేసిన గెడ్డం మహాలక్ష్మి 30,460 ఓట్లతో గెలుపొందారు. కమ్యూనిస్టులను మట్టి కరిపించి కాంగ్రెస్‌కు పునాది వేశారు. 1967లో జనరల్‌గా మారడంతో కాంగ్రెస్ అభ్యర్థి నయినాల గణేశ్వరరావు 17,825 ఓట్లతో విజయం సాధించారు. 1972లో స్వతంత్ర అభ్యర్థి బిక్కిన గోపాలకృష్ణారావు 37,921 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థిగా గెలుపొందారు. 1978లో రుద్రరాజు రామలింగరాజు 37,992 ఓట్లతో కాంగ్రెస్ జెండా ఎగురవేశారు. 1983లో టీడీపీ ఆవిర్భావంతో ఏవీ సూర్యనారాయణరాజును ఓటర్లు గెలిపించారు. అప్పుడు ఆయనకు 36,674 ఓట్లు రాగా 1985లో జరిగిన ఉప ఎన్నికల్లో 47,230 ఓట్లతో ఆయన ఎన్నికయ్యారు. 1989లో జరిగిన ఎన్నికల్లో రాజోలు ఓటర్లు సామాజిక మార్పును కోరుకున్నారు. దీంతో నియోజకవర్గంలో పట్టున్న సామాజికవర్గానికి చెందిన మంగెన గంగయ్య 46,413 ఓట్లు సాధించి టీడీపీ అభ్యర్థిపై విజయం సాధించి రికార్డు సృష్టించారు. 1994లో ఏవీ సూర్యనారాయణరాజును గెలిపించి టీడీపీ తన బలాన్ని నిరూపించుకుంది. ఈ ఎన్నికల్లో సూర్యనారాయణరాజుకు 48,505 ఓట్లు వచ్చాయి. 1999లో కూడా మళ్లీ సూర్యనారాయణరాజు 49,204 ఓట్లు సాధించి గెలుపొందారు. ఆ సమయంలో కాంగ్రెస్ పార్టీ గంగయ్యకు టిక్కెట్ ఇవ్వకపోవడంతో (పత్యర్థి ఏవీ సూర్యనారాయణరాజుతో చేతులు కలిపారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా అల్లూరి కృష్ణంరాజు 68,104 ఓట్లు సాధించి 28,018 ఓట్ల మెజారిటీతో నియోజకవర్గ చరిత్రలో రికార్డు సృష్టించారు.




అల్లూరి రామరాజు



రుద్రరాజు రామలింగరాజు



ఏవీఎస్ రాజు




అల్లూరి కృష్ణంరాజు



బిక్కిన గోపాలకృష్ణమూర్తి



గొల్లపల్లి సూర్యారావు



మంగెన గంగయ్య



రాపాక వరప్రసాద్

సమస్యలు

రాజోలు మండలంలో ఉన్న డ్రైనేజీలు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయి. మలికిపురం మండలంలో గోదావరి తీరం వెంబడి గ్రోయిన్స్ లేకపోవడం వల్ల నదీ తీరంలోకి కొట్టుకుపోతున్నాయి. ఉప్పునీటితో లక్షలాది కొబ్బరిచెట్లు మృత్యువాత పడుతున్నాయి. సఖినేటిపల్లి మండలంలో వేసవికాలంలో తాగునీటి సమస్య అధికంగా ఉంది. రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, మురుగు కాల్వలు, పంట కాల్వలు అధ్వానంగా మారాయి. సాగునీరు అందక, వరి పొలాలు ఊడ్చకపోవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు.



దిండి రిసార్ట్స్



పూలతో తీర్చిదిద్దిన గ్లాసు, సైకిల్, కమలం గుర్తులు

గ్లాస్, కమలం గుర్తులను తీర్చిదిద్దిన దృశ్యం

కడియం, మే 1 : కడియపులంక గ్రామానికి చెందిన సత్యదేవానాగేశ్వర నర్సరీరైతు పుల్లా చినసత్యనారాయణ, రామాంజనేయ నర్సరీ రైతు కర్రి ఎస్సయ్యలు వారి నివాసం వద్ద ఉన్న ప్రాంగణంలో కూటమికి చెందిన తెలుగుదేశం గుర్తు సైకిల్, బీజేపీ గుర్తు కమలం, జనసేన గుర్తు గ్లాస్ గుర్తులను అందంగా తీర్చిదిద్దారు. గుర్తుల చుట్టూ పూలతో అలంకరణచేసి వాటి మధ్యలో ప్రమిదలతో కూ డిన విద్యుత్ కాంతును ఏర్పాటు చేశారు. వీటిని పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్లలు తిలకించారు.

ఘనంగా సీటీఆర్ఐ ఆవిర్భావ దినోత్సవం

రాజమహేంద్రవరం రూరల్ మే1: ఐసిఏఆర్- కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ 77వ వ్యవస్థాపక కార్యక్రమం సీటీఆర్ఐ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. సంస్థ డైరక్టర్ ఎం. శేషుమాధవ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి పూర్వపు డైరక్టర్ జనరల్ పిపివిఆర్ఏ చైర్ పర్సన్ త్రిలోచన మెహోపాత్ర ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 76 సంవత్సరాలుగా పొగాకు సాగులో అత్యుత్తమ పరిశోధనలు జరిపి అధిక దిగుబడులనిచ్చే మేలైన పొగాకు వంగడాలు రూపొందించిందన్నారు. తద్వారా రైతుల సాంఘిక ఆర్థిక అభివృద్ధికి గణనీయమైన కృషి చేస్తూ జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పొగాకు పరిశోదనా రంగంలో విశేష ఖ్యాతిని గడించిందన్నారు. సంస్థ ప్రారంభించినప్పటి నుంచి చేపట్టిన కార్యక్రమాలపై పలువురు విశదీకరించారు. అనంతరం పొగాకు మిరపలో పురుగుమందుల అవశేషాలు, ఫైటోకెమికల్ విశ్లేషనపై మాన్యువల్ తదితర 7 అంశాలతో కూడిన ప్రచురణలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు శాస్త్రవేత్తలను అభ్యుదయ రైతులను సత్కరించారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి నియామకంపై వివాదం

- దినసరి వేతనంపై పనిచేసే ఒక ఉద్యోగికి జీతం పెంపు

దివాన్‌చెరువు, మే1: ఆదికవినన్నయ విశ్వవిద్యాలయంలో ఒకఅవుట్‌సోర్సింగ్ ఉద్యోగి నియామకం పెద్ద వివాదంగా మారింది. విశ్వవిద్యాలయంలో దాదాపు 150 మంది ఔట్ సోర్సింగ్‌పద్దతిలో ఎంతోకాలంగా పనిచేస్తున్నారు. వీరికి నెలకు రూ18,500 జీతంగా చెల్లిస్తున్నారు. తమ జీతాలు పెంచాలని ఎప్పటినుంచో వారు డిమాండ్ చేస్తున్నారు. ఈ డిమాండ్ అమలు విషయాన్ని నన్నయ అధికార్లు కాలయాపన చేస్తున్నారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయంలో దినసరి వేతనంపై పనిచేసే ఒక ఉద్యోగిని నెలకు రూ.35 వేల జీతంపై నియమించడం వివాదంగా మారింది. దీనిపట్ల అభ్యంతరం వ్యక్తంచేస్తూ అవుట్‌సోర్సింగ్ సిబ్బంది వీసీ ఎదుట మంగళవారం ఆందోళన వ్యక్తం చేశారు.. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో దినసరి వేతనంపై పనిచేస్తున్న ఒక వ్యక్తిని, అవుట్ సోర్సింగ్ పద్దతిలో నెలకు రూ.35 వేలు వేతనం చెల్లించే విధంగా విశ్వవిద్యాలయం అధికార్లు ఒక ప్రోగ్రామర్‌ను నియమించుకున్నారు. దీనిపై నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్‌ను ఆంధ్రజ్యోతి ప్రశ్నించగా విశ్వవిద్యాలయంలో ప్రవేశాలు, పరీక్షలు, ఫీజులు చెల్లింపు వంటి వాటిని ఆటోమేషన్ చేస్తున్నామన్నారు. విశ్వవిద్యాలయంలో దినసరి వేతనంపై పనిచేస్తున్న ఒక ఉద్యోగిని వికాస ద్వారా ఎంపిక చేసి నెలకు రూ.35 వేలు జీతం చెల్లించే విధంగా ప్రోగ్రామర్‌గా ఆరునెలల కాలానికి నియమించుకోవడం జరిగిందని చెప్పారు దీనికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం తీసుకుని ఎన్నికల కోడ్‌కు ముందే నియామకం జరిగిందని రిజిస్ట్రార్ సుధాకర్ వివరించారు..

సంత మార్కెట్‌కు పూర్వ వైభవం తీసుకొస్తా : నెహ్రూ

గోకవరం, మే1: రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థిగా తాను గెలుపొందితే సంత మార్కెట్‌కు పూర్వ వైభవం తీసుకొస్తానని జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అన్నారు. మండల కేంద్రమైన గోకవరంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెహ్రూ వైసీపీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను వివరిస్తూ రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ఉదయశ్రీనివాస్‌ను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వైష్ణవ్‌తేజ్, సుధీర్, గిరీష్‌వర్మ

హీరో వైష్ణవ్‌తేజ్ ప్రచారం

కొత్తపల్లి, మే 1: కూటమి పిఠాపురం అభ్యర్థి పవన్‌కల్యాణ్ లక్ష ఓట్ల మెజార్టీతో గెలుస్తారని ఉప్పెన సినిమా హీరో వైష్ణవ్‌తేజ్ అన్నారు. కొత్తపల్లి మండలంలో బుధవారం పలు గ్రామాల్లో నిర్వహించిన రోడ్డుషోలో దారి పొడవునా మహిళలు మంగళ హారతులు పట్టారు. కార్యకర్తలు రెట్టింపు ఉత్సాహంతో గజమాలతో వైష్ణవ్‌తేజ్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇసుకపల్లి, నాగులాపల్లి, రమణక్కపేట, శ్రీరాంపురం గ్రామాల ప్రధాన కూడళ్లలో నిర్వహించిన రోడ్‌షోలో ఆయన ప్రసంగించారు. కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని కాపాడటం కోసం పవన్ కూటమితో ముందుకు వచ్చారని, పవన్‌ను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎటువంటి స్వార్థం లేని వ్యక్తిని ఎమ్మెల్యేగా అసెంబ్లీకి పంపాలని అన్నారు. తద్వారా నియోజకవర్గమే కాకుండా రాష్ట్రం అభివృద్ధి బాటలో పయనిస్తుందని చెప్పారు. కొత్తపల్లి మండలంలో నిర్వహించిన రోడ్‌షోలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కృష్ణం రాజు, టీడీపీ యువ నాయకుడు గిరీష్‌వర్మ, బుల్లితెర నటులు సుడిగాలి సుధీర్, గెటప్ శ్రీను పాల్గొన్నారు.



చిన్నారికి షేక్ హ్యాండ్ ఇస్తున్న వైష్ణవ్‌తేజ్

మద్యం కేసులపై అన్ని కోణాల్లో దర్యాప్తు

కాకినాడ జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

పిఠాపురం/గొల్లప్రోలు రూరల్, మే 1: పిఠాపురం పట్టణంలోని మూడుచోట్ల, మండలంలోని కుమారపురంలో ఒక చోట భారీగా పట్టుబడిన మద్యానికి సంబంధించి నాలుగు కేసులు నమోదు చేయగా, వాటిపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ వెల్లడించారు. గొల్లప్రోలు మండలం తాటిపర్తి, చినజగ్గంపేట గ్రామాల్లో బుధవారం సాయంత్రం పర్యటించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలో సెబ్ అధికారులు నమోదు చేసిన రెండు కేసుల్లో ఇద్దరు నిందితులను అరెస్టు చేయాల్సి ఉందని తెలిపారు. దీని వెనుక ఎవరున్నారు, ఎక్కడ నుంచి మద్యం వచ్చింది, వాటిని ఎవరి కోసం ఎవరు తీసుకువచ్చారు తదితర అంశాలపై దర్యాప్తు సాగిస్తున్నామని వివరించారు. దీనిపై లింకులు ఎంత వరకూ వెళతాయో అక్కడ వరకూ దర్యాప్తు సాగుతుందని తెలిపారు. నకిలీ మద్యమా, గోవా తయారీ మద్యమా తదితర అంశాలను తెలుసుకునేందుకు మద్యం శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపామని, రిపోర్టులు వచ్చేందుకు 10-15 రోజులు సమయం పడుతుందని చెప్పారు. దర్యాప్తు సరైన మార్గంలోనే కొనసాగుతోందని చెప్పారు. వివరాలు బయటకు వస్తే దర్యాప్తుకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. మూడు రోజులు క్రితం చినజగ్గంపేటలో వైసీపీ నాయకునికి చెందిన భవనంలో మద్యం నిల్వలు ఉన్నాయని వచ్చిన ఫిర్యాదులపై తనిఖీలకు వచ్చిన అధికారులు తనిఖీ చేయకపోవడాన్ని ప్రస్తావించగా, సీ విజిల్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

పారదర్శకంగా ఈవీఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ : ఆర్వో

రాజానగరం, మే 1 : సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో భాగంగా రాజానగరం అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించిన రెండో రౌండ్ తుది విడత ఈవిఎంల ర్యాండమైజేషన్ ప్రక్రియ అభ్యర్థులు సమక్షంలో ఎన్నికల పరిశీలకులు నిర్వహించినట్లు రాజానగరం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ.చైత్రవర్షిణి తెలిపారు. ఈసందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ రాజానగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు(ఈవిఎంలు)బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వివిపాట్స్ ఓటరు రెండో తుది విడత ర్యాంమమైజేషన్ ప్రక్రియ ఈవిఎం ర్యాండమైజేషన్ ప్రక్రియ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించామన్నారు.

సుడిగాలి సుధీర్, గెటప్ శ్రీను పూజలు



పూజలు నిర్వహిస్తున్న సుధీర్, గెటప్ శ్రీను

పిఠాపురం, మే 1: పిఠాపురంలోని ఆలయాల్లో సినీనటులు సుడిగాలి శ్రీధర్, గెటప్ శ్రీనులు బుధవారం పూజలు నిర్వహించారు. పట్టణంలోని శ్రీపాదశ్రీవల్లభ మహాసంస్థానం, పాదగయ క్షేత్రంలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహుతికా అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పిఠాపురం అసెంబ్లీ స్థానం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్ లక్షకు పైగా మెజార్టీతో విజయం సాధించడం ఖాయమన్నారు. తాము నటులుగా ఇక్కడకు రాలేదని, పవన్‌కల్యాణ్ అభిమానులుగా ఇక్కడకు వచ్చామని తెలిపారు. తాము చిన్నప్పటి నుంచి మెగా అభిమానులమని అన్నారు. ఏ పదవి లేకుండా పవన్ తన సొంత నిధులు వెచ్చించి అందరినీ ఆదుకుంటున్నారని తెలిపారు. పవన్ ఎమ్మెల్యే అయితే పిఠాపురం టెంపుల్ సిటీగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. తాము నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారం చేస్తున్నామని తెలిపారు.

సిగరెట్లు స్వాధీనం

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని కేవీఆర్ స్వామి రోడ్‌లో శ్రీ మీనాలక్ష్మి ఫ్యాన్సీ అండ్ జనరల్ గూడ్స్ దుకాణంలో సోదాలు నిర్వ హించామని విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలు నాయుడు తెలిపారు. అవి బ్రాండెడ్ కాని సిగరెట్లని గుర్తించినట్లు చెప్పారు. మొత్తం 1551 సిగరెట్ ప్యాకెట్లలో రూ.4.27 లక్షల విలువ చేసే సిగరెట్లను స్వాధీనం చేసుకున్నా మన్నారు. షాపు యజమాని సలాది శ్రీనివాసరావుపై కేసు నమోదు నిమిత్తం త్రీటౌన్ పోలీసులకు అప్పగించామని పేర్కొన్నారు. వాటిని చెన్నై నుంచి తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు నిందితుడు చెప్పాడన్నారు. సోదాల్లో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి, నాగ వెంకటరాజు, భార్గవ మహేశ్, నవీన్ పాల్గొన్నారు.

కార్మిక దినోత్సవం రోజున..

రైల్వే మహిళా కార్మికుల కన్నీరు

- కాంట్రాక్టరు నిర్లక్ష్యం.. 5 నెలలుగా జీతాల్లేవ్



రైల్వే స్టేషన్ కార్మికుల నిరసన

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): రైల్వే అధికారుల అలసత్వం.. కాంట్రాక్టరు నిర్లక్ష్యం ఏకమై కార్మిక దినోత్సవం రోజున రైల్వే మహిళా కార్మికులను కన్నీరు పెట్టించాయి. జీతం అడగడమే వారి పాలిట శాపమైంది. రాజమండ్రి రైల్వేస్టేషన్లో ఆరోగ్య విభాగంలో 38 మంది మహిళలు పొరుగు సేవల ప్రాతిపదికపై సఫాయ్ వాలా (పారిశుధ్య కార్మికులు)లుగా పనిచేస్తున్నారు. వీరిలో పదేళ్ల నుంచీ విధుల్లో ఉన్నవాళ్లు కొందరు ఉన్నారు. రైల్వే ట్రాకు, ప్లాట్‌ఫాంలు, గదులు, టికెట్ కౌంటర్లు, వెయిటింగ్ హాళ్ల శుభ్రం చేయడం వంటి పనులకు వీరిని వినియోగిస్తారు. అయితే ఐదు నెలలుగా వీరికి జీతాలు ఇవ్వడం లేదు. ఏజీఎల్ గ్రూపు కాంట్రాక్టు జనవరితో ముగిసింది. ఆ సంస్థ డిసెంబరు (2023), జనవరి నెలల జీతం బకాయి ఉంది. తర్వాత కొత్తగా ఎస్ఆర్‌కే అనే సంస్థకు కాంట్రాక్టు దక్కింది. ఆ సంస్థ ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల జీతాలు ఇవ్వాల్సి ఉంది. వీటిపై సంబంధిత అధికారి అయిన హెచ్‌ఐకి మహిళా కార్మికులు ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకపోయింది. రేపు మాపు అంటూ కాలయాపన చేశారు. దీంతో విసిగిపోయిన కార్మికులు తమ జీతాలు చెల్లించే వరకూ పనిలోకి వచ్చేదిలేదని మే 1(నిన్న) సదరు అధికారికి చెప్పేశారు. కనీసం ఒక్కనెల జీతమైనా వెంటనే ఇవ్వాలని అభ్యర్థించారు. కాంట్రాక్టరు లేదా ఉన్నతాధికారులతో మాట్లాడి జీతాలు వచ్చే ఏర్పాటు చేయాల్సిన ఆ అధికారి సరిగా స్పందించలేదు. పైగా వీళ్లను పక్కనపెట్టి శాశ్వత కార్మికులతో పనులు చేయించుకోవడానికి ఉపక్రమించారు. దీంతో మహిళా పారిశుధ్య కార్మికులు రైల్వేస్టేషను బయట శాంతియుత నిరసనకు దిగారు. తమకు ఐదు నెలల నుంచీ జీతం ఇవ్వకపోగా వాటిని అడిగినందుకు తమను పనిలోంచి తీసేయడానికి చూస్తున్నారంటూ మహిళా పారిశుధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు.వీరి బాధను రైల్వే అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడం గమనార్హం. వివరణ కోరడానికి రైల్వే హెచ్‌ఐ శ్రీరాములును ఫోన్‌లో సంప్రదించడానికి 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా ఆయననుంచి స్పందన కరువైంది.

ఉచిత బాస్కెట్‌బాల్ శిక్షణ శిబిరం ప్రారంభం

రాజమహేంద్రవరం కల్చరల్ మే1: స్థానిక ఎస్.కె.వి.టి.డిగ్రీ కళాశాల ఆవరణలో బుధవారం మే 1 నుంచి 31ఉచిత బాస్కెట్ బాల్ శిక్షణాశిబిరం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ప్రిన్సిపాల్ రాజబాబు మాట్లాడుతూ విద్యార్థులు వేసవి ఉచిత బాస్కెట్‌బాల్ శిక్షణా శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణపొందిన క్రీడాకారులు రాష్ట్ర జాతీయస్థాయికి ఎదగాలను ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాజమండ్రి చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, సిటీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్‌కుమార్, కాలేజీ వైస్‌ప్రిన్సిపాల్ రమణమూర్తి, నాధన్, కాలేజి పి.డి.కిషోర్‌బాబు, సంధ్య పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి ఎన్డీయే కూటమితోనే సాధ్యం



మండపేటలో జరిగిన జనసేన బహిరంగ సభలో జనసేనాని పవన్ కళ్యాణ్‌తో అనపర్తి నియోజకవర్గ ఎన్డీయే బీజేపీ అభ్యర్థి రామకృష్ణారెడ్డి

- ఎన్డీయే కూటమి అభ్యర్థి నల్లమిల్లి తరపున ప్రచారం



గొల్లల మామిడాడలో ప్రచారం నిర్వహిస్తు న్న నల్లమిల్లి కుమార్తె డాక్టర్ సనాతని

అనపర్తి, మే 1 : రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం, యువత భవిత, మహిళ రక్షణ ఎన్డీయే కూటమితో ఏర్పడే ప్రభుత్వానికే సాధ్యపడుతుందన్న నినాదంతో అనపర్తి నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విజయం కోరుతూ ఓవైపు ఆయన కుటుంబ సభ్యులు మరో వైపు పార్టీ శ్రేణులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. బుధ వారం అనపర్తి శివారు కొత్తూరులో నల్లమిల్లి సతీమణి మహాలక్ష్మి ఇంటింట ప్రచారం నిర్వహిస్తూ కమలం గుర్తుకు ఓట్లు వేసి పార్లమెంట్ అభ్యర్థి పురందేశ్వరి, అసెంబ్లీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డిలను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమెకు గ్రామంలో ఘన స్వాగతం లభించింది. మహిళలు హారతులు పడుతూ స్వాగతం పలికారు. ఆమె వెంట మహాశక్తి మహిళలు పాల్గొన్నారు. అదేవిధంగా పెదపూడి మండలం గొల్లల మామిడాడలో నల్లమిల్లి తనయ డాక్టర్ సనాతని ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కూటమి మేనిఫెస్టోలో అంశాలను వివరిస్తూ కమలం గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. ఆమె వెంట నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు జుత్తుగ సూర్యకుమారి ప్రచారంలో పాల్గొన్నారు. అదేవిధంగా బిక్కవోలు మండలం మెళ్ళూరు గ్రామంలో రాష్ట్ర సర్పంచ్‌ల సమాఖ్య మాజీ అధ్యక్షుడు, బిక్కవోలు మాజీ జెడ్పీటీసీ పడాల వెంకటరామారెడ్డి కూటమి అభ్యర్థులు పురందేశ్వరి, రామకృష్ణారెడ్డిల విజయం కోరుతూ ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పడాలకు గ్రామస్థుల నుండి విశేష ఆదరణ లభించింది. అవినీతి ప్రభుత్వాని గద్దె దించాలని లేకుంటే భవిష్యత్ తరాల వారు భవిష్యత్ లేకుండా పోతుందని అన్నారు.

మండపేట బహిరంగ సభలో జనసేనానితో రామకృష్ణారెడ్డి

మండపేటలో బుదవారం జరిగిన జనసేన అదినేత పవన్‌కళ్యాణ్ సభలో అనపర్తి ఎన్డీయే కూటమి బీజేపీ అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు. పవన్ బహిరంగ సభకు అనపర్తి నియోజకకవర్గం నలుమూలల నుండి పవన్, జనసేన అభిమానులు భారీగా తరలివెళ్ళారు. ఈ సందర్భంగా జరిగిన సభలో జనసైనికులు, తన అభిమానులు అనపర్తి నియోజకవర్గ జనసైనికులు నల్లమిల్లికి మద్దతు ప్రకటించి భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అదే విదంగా జనసేనాని పలుమార్లు తన ప్రసంగంలో నల్లమిల్లి ప్రస్థావన తీసుకురావడంతో అనపర్తి జనసైనికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బిక్కవోలు మండలం మెళ్ళూరులో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న రాష్ట్ర సర్పంచ్‌ల సమాఖ్య మాజీ అధ్యక్షుడు పడాల రాము

జర్నలిస్టులు పేదలైతే ఇళ్లు వచ్చేవి : ఎంపీ భరత్

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): జర్నలిస్టులు ధనవంతులని.. పేదవారైతే ఇప్పటికే గృహాలు పొందేవారని తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ స్పష్టం చేశారు. కూటమి మేనిఫెస్టోపై బుధవారం ఆయన మీడియా సమావేశం ఏర్పాటుచేశారు. మేనిఫెస్టో సమయంలో చంద్రబాబు హావ భావాలు, పక్కన కూర్చున్న వాళ్ల గురించి విమర్శలు గుప్పించడం తప్ప..కూటమి మేనిఫెస్టోకి వైసీపీ మేనిఫెస్టోకి ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా చెప్పలేకపోయారు. తమ మేనిఫెస్టో వల్ల ప్రజలకు కలిగే ఉపయోగాలనూ వివరించలేదు.ఈ ఐదేళ్లలో జర్నలిస్టుకు కనీసం గృహాలు కూడా కల్పించలేక పోయారని, తాము కల్పిస్తామంటూ టీడీపీ మేనిఫెస్టోలో సైతం పేర్కొన్నారని జర్నలిస్టులు ప్రస్తావించారు.దీనిపై ఎంపీ స్పందిస్తూ.. జర్నలిస్టుల్లో పేదవాళ్లంటే గృహాలు వచ్చేవంటూ ఎద్దేవా చేశారు.పారిశ్రామిక రంగంపై వైసీపీ మేనిఫెస్టోలో కనీసం ప్రస్తావనా లేకపోవడంపై ఆయన మాట దాటవేశారు.

ప్రజలకు చేరువగా కాంగ్రెస్ మేనిఫెస్టో

రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, మే 1: రాష్ట్రంలో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రజలకు చేరువగా వెళ్లిందని ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో గిడుగు రుద్రరాజు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజా, కాంగ్రెస్ పార్టీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుద్రరాజు, రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. 28 పార్టీలు కలిపి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 200 సీట్లు కూడా వచ్చే అవకాశాలు లేవన్నారు. భారత దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రంలో ఉన్న అధికార ప్రతిపక్ష పార్టీలు మోది కనుసన్నల్లోనే నడుస్తున్నాయని, వాటిని గెలిపిస్తే బీజేపీని గెలిపించినట్లేనన్నారు.ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి, విశాఖ ఉక్కును పరిరక్షించడం, ఎల్ఐసీని ప్రైవేట్ పరం కాకుండా కాపాడడం, నిరుద్యోగ సమస్యను తీర్చడం ఇండియా కూటమితోనే సాధ్యమన్నారు.

అవధాన కళాపరిచయంపై

సర్టిఫికెట్ కోర్సు

రాజమహేంద్రవరం అర్బన్, మే 1: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో అవధాన కళాపరిచయం అనే సర్టిఫికెట్ కోర్సును ప్రారంభిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే తెలిపారు. ఈమేరకు బుధవారం కళాశాల లలిత కళల విభాగం, ఆస్ట్రేలియాకు చెందిన తటపర్తి గురుకులంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నామని తెలిపారు. తెలుగు సాహిత్యాన్ని అభివృద్ధి చేయడానికి, విద్యార్థుల్లో తెలుగు సాహిత్యాభిమానాన్ని పెంచడానికి, అవధాన కళను ప్రోత్సహించడానికి ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు. మే 18 నుంచి డిసెంబరు 18వ తేదీ వరకూ ప్రతి శనివారం రెండు గంటలపాటు మొత్తం 30 వారాలు ఇంటర్నెట్‌లో ఈ కోర్సు కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. వయసుతో నిమిత్తం లేకుండా ఎవరైనా ఈ కోర్సుకు రూ.2,000ల ఫీజుతో రిజిస్టర్ చేసుకోవచ్చని, దరఖాస్తుకు మే 15 ఆఖరి తేదీ అని ఆయన పేర్కొన్నారు.

ఉచిత చిత్రలేఖన తరగతులు ప్రారంభం

రాజమహేంద్రవరం కల్చరల్ మే 1: దామెర్ల రామారావు ఆర్ట్స్ అకాడమీ, మనం ఆర్ట్స్ అకాడమీ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఉచిత వేసవి చిత్రలేఖన తరగతులు బుధవారం దామెర్ల రామా రావు ప్రభుత్వ ఆర్ట్ గ్యాలరీలో ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు. అకాడమీ కార్య దర్శి పి.వి.ఎస్.కృష్ణారావు పిల్లల్ని ఉద్దేశించి మాట్లాడుతూ చిత్రలే ఖనం తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణ తరగ తులు ముగింపు రోజున విద్యార్థుకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేస్తామన్నారు. వివరాలకు 8125837770,728600439లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కె.ఎస్.స్వామి, పి.శ్రీవిద్య, అమర్, ఎ.జాన్సన్, కేర్ టేకర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

ఏజెన్సీ సమాచారం

రంపచోడవరంలో స్వతంత్ర అభ్యర్థికి గాజుగ్లాసు గుర్తు

● ఈవీఎంలలో బ్యాలెట్ అమరిక, పోస్టల్ బ్యాలెట్ ముద్రణ పూర్తి

రంపచోడవరం, మే 1: ఎన్నికల గుర్తుల కేటాయింపుకు సంబంధించి జనసేన దాఖలుచేసిన కేసులో హైకోర్టు తీర్పు చెప్పడంతో రంపచోడవరంలో స్వతంత్ర అభ్యర్థి పల్లాల లచ్చిరెడ్డికి రిటర్నింగ్ అధికారి కేటాయించిన గాజుగ్లాసు గుర్తును ఖరారు చేశారు. తొలుత సదరు అభ్యర్థికి పనసకాయను కేటాయించినట్టు చెప్పగా, సోమవారం అర్ధరాత్రి ఎన్నికల సంఘం సూచనలతో గాజుగ్లాసు గుర్తు జనసేన పోటీ లేనిచోట ఎవరు కోరుకున్నా ఇవ్వాల్సిందేనన్న సూచనతో గాజుగ్లాసును ఆయనకు కేటాయించారు. ఆ ప్రకారం మంగళవారం నాటికే ఫారమ్-7ఏ ప్రకారం ఎన్నికల సంఘం సూచనతో ఈవీఎమ్‌లలో బ్యాలెట్ ఏర్పాటు, పోస్టల్ బ్యాలెట్ ముద్రణను చేపట్టాల్సి ఉండగా. హైకోర్టులో కేసులు దాఖలు కావడంతో ఈ పై ప్రక్రియను తాత్కాలికంగా నిలుపుదల చేసిన అధికారులు బుధవారం ఈ పనులు పూర్తి చేశారు.

రంపచోడవరంలో మిరియాల శిరీషాదేవి ప్రచారం



రంపచోడవరం, మే 1: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అసెంబ్లీ అభ్యర్థి మిరియాల శిరీషాదేవి బుధవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పందిరిమామిడి, బందపల్లి, బోలగొండ, చెరువూరు, వాడపల్లి, గుంజుగూడెం, మడిచర్ల, బూసిగూడెం గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, టీడీపీ నాయకులు జంజ్యం సత్య నాగేష్, ముచ్చు నాగేశ్వరరావు, ముచ్చు త్రిమూర్తులు, లంక హరిబాబు, పి.రత్నం, మద్దేటి అంజిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా మేడే

మోతుగూడెం, మే1:మోతుగూడెంలో ప్రపంచ కార్మిక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మోతుగూడెంలో 327 యూనియన్ ఆఫీస్‌వద్ద జెండా వందనం కార్యక్రమ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మెంబర్ జి.భగవాన్, ప్లాంట్ అటెండెంట్ జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ పి.ఆనందబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఆర్‌వీ రమణ, ట్రెజరర్ జి.శ్రీను, బ్రాంచ్ ప్రెసిడెంట్ పి.శ్రీను, సెక్రటరీ డి. దుర్గాప్రసాద్, శర్మ, వెంకటేశ్వరరావు, భాస్కర్, రెడ్డి, రఘు, సంజీవరావు, కె.ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే

వై.రామవరం, మే1: వై.రామవరంలో బుధవారం మేడే వేడుకలు ఘనంగా జరిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి శాంతిరాజు, జిల్లా నాయకులు జి.రామకృష్ణ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి బస్‌సెంటర్ వరకు ర్యాలీ జరిపి సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యలపై దృష్టి సారించడంలేదని ఆరోపించారు. సీఐటీయూ అధ్యక్షురాలు జి.బేబిరాణి, జిల్లా నాయకులు ఆంజనేయులు, దుర్గ, అంగన్‌వాడీ నాయకులు అమ్మాని, జోగమ్మ, కె.బుల్లమ్మ పాల్గొన్నారు.

లోయర్ సీలేరు ఎస్ఈ పదవీ విరమణ

మోతుగూడెం, మే1: చింతూరు మండలం మోతుగూడెం లోయర్ సీలేరులో గత 35 సంవత్సరాలుగా ఏపీజెన్కోలో అంకితభావంతో పని చేసిన కె.వెంకటేశ్వరరావు మంగళవారం పదవీ విరమణ చేశారు. ఆయన గతంలో విజయవాడ విద్యుత్ సౌధలో ఈటీపీఎస్‌లో 28 సంవత్సరాలుగా ఏఈ, ఏడీలుగా విధులు నిర్వహించారు. ప్రమోషన్ మీద ఒక సంవత్సరం ఆర్టీపీడీఈగా విధులు నిర్వహించారు. అక్కడి నుంచి సూపరింటిండెంట్ ఇంజనీర్‌గా ప్రమోషన్ మీద లోయర్ సీలేరుకు వచ్చారు. ఇక్కడ ఐదు సంవత్సరాలు విధులు నిర్వహించారు. ఇన్‌చార్జ్ చీఫ్ ఇంజనీర్‌గా కూడా విధులు నిర్వహించారు. ఈ రోజు ఆయన పదవీ విరమణ ముఖ్యఅతిథిగా సీలేరు కాంప్లెక్స్ ఏపీ జెన్కో చీఫ్ ఇంజనీర్ బొడ్డు శ్రీధర్, ప్లాంట్ మేనేజర్ భీమవరపు బాలకృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వరప్రసాద్, ఈఈ వరప్రసాద్, అసిస్టెంట్‌సెక్యూరిటీ ఆఫీసర్ సూర్యమోహన్‌రావు, సీనియర్ అకౌంటు ఆఫీసర్ వరప్రసాద్, ఏఎస్ నాగేశ్వరరావు, జేఏవో ఆనంద్, ఎలడిసి వేమగిరి కిరణ్ లోయర్ సీలేర్‌లో ఏపీ జెన్కో ఉద్యోగస్తులు, కాంట్రాక్ట్ కార్మికులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఏపీ జెన్కోలో బయట పని చేస్తున్న సీఈ కాంతారావు, ఎస్ఈలు, అధికారులు, లోయర్ సీలేరు వచ్చి మోతుగూడెం ఎస్ఐ జిగోపాలరావు, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు, సర్పంచ్ ఆకేటి సీత, జర్నలిస్టులు ఏపీ జెన్కో విద్యుత్ కళాభారత నందు పదవి విరమణ చేసిన వెంకటేశ్వరావును సన్మానం చేశారు.

జగన్ కథ ముగిసింది

కూనవరం, మే1: ఉత్తుత్తి పథకాలతో ఇన్నాళ్లు ప్రజలను మోసం చేసిన జగన్మోహన్‌రెడ్డి కథ ముగిసిందని మాజీ ఎంపీపీ తెలుగుదేశం పార్టీ మండల కార్యదర్శి పొడియం అప్పారావు అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గొమ్ముగూడెంలో తెలుగుదేశం ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు ఎడవిల్లి భాస్కరరావు, మండల అధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు, షరీఫ్, ఉమా పాల్గొన్నారు.

538 మందికి ఇంటింటికీ పింఛన్లు

వై.రామవరం, మే1: 1వతేదీనే పింఛన్లు అందుతాయనుకుని ఎదురుచూసిన లబ్ధిదారులకు నిరాశ ఎదురైంది. ప్రభుత్వ వైఖరితో మండలంలోని 90శాతం పైగా పింఛన్‌దారులకు పింఛన్‌సొమ్ములు బ్యాంకు అకౌంట్లకు జమచేశారు. బుధవారం మేడే సందర్భంగా బ్యాంకు సెలవు కావడంతో గిరిజన గ్రామాల్లో లబ్ధిదారులు ఎవరికీ పింఛన్లు అందక నిరాశకు గురయ్యారు. మండలంలో మొత్తం 3391 సామాజిక పింఛన్లు ఉండగా వాటిలో కేవలం 538 మందికి మాత్రమే ఇంటింటికి పంపిణీ చేయాలని ఆదేశాలున్నాయి. అధికశాతం మంది సచివాలయాలకు వెళ్లి పింఛన్లు తీసుకున్న పరిస్థితులు నెలకొన్నాయి.

టీడీపీ అధికారంలోకి వస్తే యువతకు బంగారు భవిష్యత్

ఎటపాక, మే 1 : ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి, చంద్రబాబును సీఎంను చేస్తేనే యువతకు ఉద్యోగాలతో బంగారు భవిష్యత్తు ఉంటుందని, లేకపోతే యువత ఉపాధి అవకాశాలు లేక పెడదారి పడతారని తెలుగు యువత రాష్ట్ర ప్రదాన కార్యదర్శి వల్లభనేని చందు అన్నారు. బుధవారం లక్ష్మీపురం గ్రామంలో బాబును మళ్లీ గెలిపిద్దాం కార్యక్రమంను నిర్వహించారు. ఈసందర్భంగా చందు టీడీపీ సూపర్ సిక్స్ పథకాలను విస్తృతంగా ప్రచారం చేశారు. కూటమి అభ్యర్థులైన కొత్తపల్లి గీత, మిరియాల శిరీషాదేవీలను గెలిపించాలని అభ్యర్థించారు. మేడివాయిలో సర్పంచ్ కారం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారంను నిర్వహించారు. కన్నాయిగూడెం గ్రామంలో ఎన్డీఏ కూటమి నాయకులు సమావేశంను నిర్వహిలచారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు కిలారు వెంకటేశ్వరరావు, రావిమాధవరావు, దొంత మంగేశ్వరరావు, పాటిచలపతి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

రంపచోడవరం, మే 1:రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి స్థానిక గిరిజన సంక్షేమ అధికారులతో బుధవారం వివిధ పార్టీకు సంబంధించిన ప్రతినిధులతో రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గం సంబందింజచ 518 ఈవీఎంలు ప్రజాప్రతినిధుల సమక్షంలో పొందుపరిచినట్లు తెలిపారు. భద్రత ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యకర్రమంలో మాజీ ఎమ్మెల్యే వంతల రాజేశ్వరి, ఏఆర్వో ఎ.కృష్ణజ్యోతి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే దేవేంద్రుడు, డీటీలు బి.రాజు, రామకృష్ణ, సుబ్బారావు, సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

నిరుద్యోగ సమస్యలో మన రాష్ట్రానికి 2వ స్థానం

● విలేకరుల సమావేశంలో కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ, మే 1: నిరుద్యోగ సమస్యలో దేశంలోనే మన రాష్ట్రానికి 2వ స్థానం వచ్చేలా నిలబెట్టిన చేతకాని ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని రాజమహేంద్రవరం సిటీ నియోజవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యరి ఆదిరెడ్డి శ్రీనివాస్ మండిపడ్డారు. రాజమహేంద్రవరం తిలక్‌రోడ్డులోని ఎన్నికల కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వినూత్నంగా నిరుద్యోగంతో బాధపడుతున్న యువతతో ఆదిరెడ్డి శ్రీనివాస్ తోపుడు బండ్లలో కూరయాలు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడ్లుతూ రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తాండవిస్తోందన్నారు. రాష్ట్రంలో 6లక్షల 16వేల మంది నిరుద్యోగులు 6.15శాతం మంది ఉన్నారన్నారు. సెం టర్ ఫర్ మోనటరింగ్ ఇండియన్ ఎకానమి 35.1శాతం నిరుద్యోగులు ఉన్నారని తెలిందన్నారు. 21వేల మంది నిరుద్యోగ యువత ఆత్మహత్యలు చేసుకున్నారని జగన్ వదిలిన బాణం ఆయన చెల్లి షర్మిళా విజయవాడలో ధర్నా చేశారని గుర్తుచేశారు. నెగ్గిన వెంటన్ మెగా డీఎస్సీ తీస్తారని 2019 మెనిఫెస్టోలో జగన్ పెట్టాడని దీనికి పదిలక్షల మంది యువత ఆశ పడితే వారి ఆశలు అడియాసాలు చేశాడన్నారు. ఈ సమావేశంలో తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవి వరప్రసాద్, డాక్టర్స్ సెల్ అధ్యక్షుడు యాళ్ళ ప్రదీప్, తెలుగు యువత నగర అధ్యక్షుడు ఉర్లంకల లోకేష్, క్లస్టర్ ఇంచార్జీ కొల్లి బుజ్జి, తెలుగు యువత నాయకులు ముసిని బాబురావు , వెల్లంకి జయరామ్, అధికార ప్రతినిధి ఈతలపాటి రవి పాల్గొన్నారు.

కార్మికులకు చట్టాలపై అవగాహన ఉండాలి

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): కార్మికుల కోసం ఉన్న చట్టాలు, హక్కులపై వారు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాశ్ బాబు పేర్కొన్నారు. మేడే సందర్భంగా డీఎల్ఎస్ఏ, కార్మిక శాఖ సం యుక్త ఆధ్వర్యంలో శ్రీరాంపురంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రకాశ్‌బాబు మాట్లాడుతూ రాజ్యాంగం కార్మికులకు కల్పించిన హక్కుల గురించి వివరించారు. అసంఘటిత కార్మికుల కోసం జాతీయ న్యాయసేవాధికార సంస్థ న్యాయ సేవల పథకం-2015పై అవగాహన కల్పించారు. కార్మికులకు న్యాయపరమైన సమస్యలుఉంటే డీఎల్ఎస్ఏని సంప్రదించాలని సూచించారు.

త్రిశూల వ్యూహంతో ఎన్నికల ప్రచారం

● కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ



గుమ్మలూరులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న బత్తుల బలరామకృష్ణ కుమార్తె వందనాంబిక, సోదరుడు గోపాలకృష్ణ, కూటమి నాయకులు

కోరుకొండ, మే1: సార్వత్రిక ఎన్నికలకు సమయం దగ్గర పడటంతో జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ త్రిశూల వ్యూహంతో ఎన్నికల ప్రచారంలో తనదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. బుధవారం కోరుకొండ మండలం గుమ్మళూరు గ్రామంలో, సీతానగరం మండలం ముగ్గళ్ళ, రఘుదేవపురం గ్రామాల్లో ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాజానగరం మండలం స్వరూపనగర్, రూపనగర్ గ్రామాల్లో కూడా ఎన్నికల ప్రచారం చేపట్టారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాజానగరం నియోజకవర్గ శాసన సభ స్థానం నుంచి జనసేన, టీడీపీ, బీజేపీ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసిన బత్తుల బలరామకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కూటమి నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బత్తులకు మద్దతుగా బీవీఆర్ చౌదరి, చిట్టూరి ప్రచారం

రాజానగరం నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు మద్దతుగా టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, ముగ్గళ్ల గ్రామంలో ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. బత్తుల బలరామకృష్ణ సతీమణి బత్తుల వెంకటలక్ష్మీవెంట ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. నా సేన కోసం నా వంతు కో ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి, టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణచౌదరి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే చిట్టూరి రవీంద్రలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు.

● గుమ్మళూరులోబత్తుల బలరామకృష్ణ కుమార్తె బత్తుల వందనాంబిక, సోదరుడు బత్తుల గోపాలకృష్ణ ఇతర టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లు మంగళవారం విడుదలచేసిన మేనిఫెస్టో కరపత్రాలను ఇంటింటికీ అందజేశారు.

● రాజానగరం నియోజకవర్గానికి చెందిన కోరుకొండ, సీతానగరం, రాజానగరం మండలాల ఇతర పార్టీలకు చెందిన పలువురు కూటమి అభ్యర్థి బలరామకృష్ణ ఆధ్వర్యంలో కోరుకొండ జనసేన పార్టీ కార్యాలయంవద్ద జనసేనపార్టీలోకి చేరారు.

● కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణను గాజుగ్లాసు గుర్తుపై ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని టీడీపీ, జనసేన,బీజేపీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. కూటమి అభ్యర్థి బత్తుల బలరామకృష్ణకు, ఆయన సతీమణి బత్తుల వెంకటలక్ష్మి, కుమార్తెలు తోట ప్రత్యూషదేవి, అల్లుడు తోట పవన్‌కుమార్, మరో కుమార్తె బత్తుల వందనాంబికకు ప్రచారంలో జనంమంగళ నీరాజనాలు అందించి ఆశీర్వదిస్తున్నారు.



ముగ్గళ్లలో ప్రచారం నిర్వహిస్తున్న బత్తుల వెంకటలక్ష్మి, మాజీ ఎంపీ చిట్టూరి రవీంద్ర, టీడీపీ ఇన్‌చార్జ్ బీవీఆర్ చౌదరి



చక్రద్వారబంధంలో మాట్లాడుతున్న కూటమి జనసేన అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ



ముగ్గళ్లలో బత్తుల బలరామకృష్ణకు మద్దతుగా అల్లుడు తోట పవన్ ప్రచారం

మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపాలి

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

రాజమహేంద్రవరం అర్బన్, మే 1 : మేడే స్ఫూర్తితో నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపి ఇండియా కూటమిని బలపరచాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ప్రస్తుత తరుణంలో ప్రతి ఒక్క కార్మికుడు దేశం కోసం ఆలోచించాలని, దేశాన్ని రక్షించుకోవాలని, మతోన్మాదశక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. బుధవారం మేడే దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజమహేంద్రవరంలో సీపీఐ, జట్లు లేబర్ యూనియన్, ఏఐటీయూసీ సంయుక్తంగా కార్మికులతో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎస్‌వీ మార్కెట్‌లో బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో సొంత చెల్లెలికి న్యాయం చేయలేని జగన్మోహనరెడ్డి రాష్ట్రాన్ని బాగు చేస్తాడా అని ప్రశ్నించారు. పులివెందులలో ఎవరిని అడిగినా వైఎస్ వివేకానందరెడ్డిని ఎవరు చంపారో ప్రతి ఒక్కరూ చెబుతారని అన్నారు. లౌకిక వ్యవస్థ ఉండదని స్వయంగా బీజేపీ కేంద్రమంత్రులే మాట్లాడడం దారుణమని అన్నారు. ఏ కేసు లేకపోయినా చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేసి 53 రోజుల పాటు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో ఉంచారని, దీనిలో అమిత్‌షా హస్తం లేదా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ అభ్యర్థి గిడుగు రుద్రరాజు మాట్లాడుతూ కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి, విశాఖ స్టీల్‌ప్లాంటు పరిరక్షణ జరుగుతుందని అన్నారు. సీపీఐ నాయకులు అక్కినేని వనజ, తాటిపాక మధు మాట్లాడారు.

1489 కేసుల మద్యం స్వాధీనం

● 1494 మంది అరెస్ట్

● అక్రమ మద్యం నిల్వలు, రవాణాపై 8686363300కి సమాచారం ఇవ్వాలి

● ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీలత

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యంపై పటిష్ట నిఘా పెట్టామని జిల్లా మద్యనిషేధ, అబ్కారీ అధికారిణి వై.శ్రీలత పేర్కొన్నారు. ఏపీఎస్‌బీసీఎల్ గోదాముల నుంచి ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్‌లకు మద్యం తరలించే వాహనాలు దారి మళ్లకుండా వాటికి జీపీఎస్.. ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామ న్నారు. వాటిని విజయవాడలోని ఎక్సైజ్ కమిషనర్, ఏపీఎస్‌బీసీఎల్ ఎండీ, రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలకు అనుసంధానించా మన్నారు. అక్రమ మద్యం నిల్వలు, రవాణాపై ఎస్ఈబీతో కలిసి విస్తృత తనిఖీలు చేపడుతున్నామని ఆమె వివరించారు. ఇప్పటివరకూ 1489 కేసుల అక్రమ మద్యాన్ని 27 వాహనాలను స్వాధీనం చేసుకొని, 1494 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. తూర్పుగోదావరిలోని ఎక్కడైనా అక్రమ మద్యం నిల్వలు, రవాణాపై సమాచారం ఉంటే తమ కంట్రోల్ రూం నెం.8686363300కి సమాచారం ఇవ్వాలని కోరారు. అలాగే బెల్ట్ షాపులు, ప్రభుత్వ మద్యం దుకాణాల్లో టోకెన్ పద్ధతిలో మద్యం విక్రయించడం వంటివి చేస్తే వెంటనే కంట్రోల్ రూం నెంబరుకు ఫోన్ చేయాలన్నారు. అవసరమైతే సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని శ్రీలత పేర్కొన్నారు.

రాజమహేంద్రవరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా

● 39వ డివిజన్ ఎన్నికల ప్రచారంలో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్



ఆదిరెడ్డి శ్రీనివాస్‌కు బూడిదగుమ్మడి కాయతో దిష్టి తీస్తున్న మహిళలు

రాజమహేంద్రవరం సిటీ, మే 1: కూటమి అధికారంలోకి వస్తే రాజమహేంద్రవరాన్ని అన్నిరంగాల్లోను అభివృద్ధి పథంలో నడిపిస్తానని సిటీ నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం సాయంత్రం రాజమహేంద్రవరం 39వ డివిజన్‌లో స్థానిక టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేశారు. ఈసందర్భంగా స్థానిక మహిళలు పెద్దఎత్తున హారతులతో భారీ స్వాగతం పలికారు. గుమ్మడికాయలతో దిష్టి తీశారు. అనంతరం ఆయన ఇంటింటికీ ఉమ్మడి మెనిఫెస్టోలోని అంశాల కరపత్రాలను, లోకల్ మేనిఫెస్టోలోని అంశాల కరపత్రాలను మహిళకు, యువతకు, వృద్ధులకు అందించారు. కూటమిని అధికారంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. తనను ఎమ్మెల్యేగా సైకిల్ గుర్తుకు ఓట్లు వేసి గెలిపించాలని, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓటువేసి గెలిపించాలన్నారు. తానను గెలిపిస్తే రాజమహేంద్రవరాన్ని ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దుతానని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తానని, ఐటీ హబ్ ఏర్పాటు, క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఏర్పాటు చేస్తామన్నారు. మెరుగైన పారిశుధ్యం, నిరంతరం సురక్షిత తాగునీరు అందిస్తామన్నారు. చెత్త పన్ను రద్దుచేయిస్తామన్నారు. టీడీపీ నాయకులు యాళ్ళ ప్రదీప్, గొర్రెల సత్యరమణి పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం

రాష్ట్ర ప్రజల భవిష్యత్తును దృష్టిలో అద్భుతమైన ఉమ్మడి మెనిఫెస్టోను రూపొందించిన టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌లకు యువత దన్యవాదాలు తెలుపుతూ వారి పెక్సీలకు పాలాభిషేకం చేశారు. స్థానిక తిలక్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని పాలాభిషేకం చేసారు. ఈ కార్యక్రమంలో నక్కాదేవివరప్రసాద్, యాళ్ళ పదీప్ పాల్గొన్నారు.

కూటమికి మద్దతు ప్రకటించిన కాపు సంఘీయులు

కాపు సంఘీయులంతా కూటమిని గెలిపించుకుంటామని తమ సంపూర్ణ మద్దతును ప్రకటించారు. రాజమహేంద్రవరం జాంపేట ఉమారామలింగేశ్వరస్వామి కళ్యాణ మండపంలో కాపు సంఘీయుల ఆత్మీయ సమావేశం బుధవారంరాత్రి కాపు సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు రామినీడు మురళీ అధ్యక్షతన జరిగింది. ఈ ఆత్మీయ సమావేశానికి రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే కూటమి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ మంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు లు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాపు నాయకులు మాట్లాడుతూ కాపులు చాలా ఇబ్బందులు పడ్డారని ఈ ఎన్నికల్లో కాపులు కూటమిని గెలిస్తారని చెప్పారు. సమాజసేవ కోసం ముందుకు వచ్చిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌ను ఇబ్బందులకు గురిచేశారని, ప్రజలు చాలా సమస్యలతో ఉన్నారని అందువలన కూటమిని గెలిపించుకుంటే ఆ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. కాపు కార్పొరేషన్ ద్వారా పేదలకు ఆదుకుంటామని, నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. టీడీపీ-జనసేన కలయికకు రాజమహేంద్రవరం వేదిక అయ్యిందని ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. కూటమితో కాపులకు న్యాయం చేస్తామని దగ్గుబాటి అన్నారు. అనంతరం కాపు సంఘీయ నాయకులు దొండపాటి సత్యంబాబు, కాపు సంఘం అధ్యక్షుడు అల్లూరి శేషనారాయణ, చింతం వీరబాబు, వై శ్రీను, కాపునాడు జిల్లా అధ్యక్షుడు గుదే రఘునరేష్ ముమ్మిడి వీరబాబు, కాపు నాయకులు యెనుముల రంగబాబు, కుచ్చు శ్రీనివాస్, సిహెచ్ శ్రీనివాస్, నాగిరెడ్డి సుబ్బారావు, బీవీ రాఘవులు, రొక్కం అప్పారావు, మాలే విజయలక్ష్మి, ఆకుల వెంకటేశ్వరరావు ,ఆకుల షణ్ముఖరావు లు మాట్లాడారు.



చంద్రబాబు, పవన్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న ఆదిరెడ్డి శ్రీనివాస్



39వ డివిజన్‌లో ప్రజలతో మాట్లాడుతున్న అభ్యర్థి ఆదిరెడ్డి



కాపుల ఆత్మీయ సమావేశంలో ఐక్యత చాటుతున్న అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్, మాజీ ఎంపీ దగ్గుబాటి, ఎమ్మెల్సీ ఆదిరెడ్డి

సారా కేసులో ఒకరికి రిమాండ్: సెబ్ ఇన్‌స్పెక్టర్ నిక్సన్

రాజమహేంద్రవరం, మే 1(ఆంధ్రజ్యోతి): నాటుసారా కేసులో ఒకరికి కోర్టు రిమాండు విధించిందని సెబ్ నార్త్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డా.ఎస్.నిక్సన్ తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో నాటుసారా తయారీ, రవాణా, నిల్వలపై విస్తృత తనిఖీలు చేస్తున్నామన్నారు. ఈ క్రమం లో మేదరపేటకు చెందిన అనుసూరి ధనలక్ష్మీ(ధన) 30లీటర్ల నాటుసారాతో పట్టుబడ్డారని చెప్పారు. గతంలో ఆమెపై మూడు నాటుసారా కేసులు ఉన్నాయన్నారు. అక్రమ మద్యానికి సంబంధించి మెరకవీధిలోని కుడుపూడి సూర్యకాంతం, తాడితోటకు చెందిన కాకరపర్తి కుమార్, ముత్తాల సత్తిబాబు, కొత్తపేటలోని కంది వెంకన్నను అరెస్టు చేసి 45 బీర్లు, 24 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. డీఎస్ఈవో పిట్టా సోమశేఖర్ ఆదేశాలతో పాడుబడిన గృహాలు, నిర్మానుష్య బహిరంగ ప్రదేశాలు, రైస్ మిల్లులు తదితర అనుమానిత ప్రాంతాలపై నిఘా పెట్టామని నిక్సన్ తెలిపారు.

సారా, మద్యం ధ్వంసం

రంగంపేట, మే 1: రంగంపేట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో పట్టుబడిన నాటుసారా, మద్యంను ధ్వంసం చేసినట్లు ఎస్ఈబి సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. తూర్పుగోదావరిజిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి పిట్టా సోమశేఖర్ వారి ఆదేశాల మేరకు వివిధ కేసులలోని నేరపు సొత్తును 32 నాటు సారాయి కేసులలో పట్టుపడిన 2550 లీటర్ల నాటుసారాను, 43 బెల్ట్‌షాప్ కేసులలో పట్టుబడిన 573 బాటిల్స్ ఎఈఎస్ ఎస్ఈబీ కె.జయమౌనిక ఆధ్వర్యంలో, స్టేషన్ సిబ్బంది, మధ్యవర్తుల సమక్షంలో ధ్వంసం చేశామని ఆయన తెలిపారు. ఈ కేసులలో పట్టుబడిన అల్యూమినియం పాత్రలు గ్యాస్ సిలిండర్లు, గ్రాస్‌స్టౌవ్‌లను, మిగిలిన ఖాళీ సీసాలను వేలం నిర్వహించగా 20100 రూపాయలు, జీఎస్టీగా 3620 రూపాయల నగదును ప్రభుత్వం ఖాతాకు జమ చేశామన్నారు. అనంతరం ఆయా మండలాల్లో దాడులు నిర్వహించగా రంగంపేట మండలం వెంకటాపురం గ్రామంలో నాటుసారా అమ్ముతున్న వాసంశెట్టి వెంకటరమణ, వాసంశెట్టి శ్రీను ఇద్దరినీ 20 లీటర్ల నాటుసారాతో అరెస్ట్ చేశామన్నారు. బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో షేక్ బహుదూర్ అను వ్యక్తిని 24 మద్యం సీసాలతో అరెస్ట్ చేసామని, ఈ దాడులో ఎస్ఈబి ఎస్ఐ. జి.అనిల్, మరియు సిబ్బంది పాల్గొన్నారని సీఐ ఎస్.రాంబాబు తెలిపారు.

మీ ఆదరాభిమానంతో విజయాన్ని అందించాలి

● దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల రోడ్‌షో

కడియం/రాజమహేంద్రవరంరూరల్, మే 1: జూన్ 4న జరిగే ఎన్నికల ఫలితాల్లో అనూహ్య విజయాన్ని అందించాలని మీరంతా ఎంతో ఆదరాభిమానం చూపుతున్నారనే విషయం తనకు రోడ్‌షో ద్వారా స్పష్టమవుతుందని ఎంపీ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. బుధవారం కడియం మండలంలో ఎంపీ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఆయన కుమార్తె కంఠమనేని శిరీష రోడ్‌షో నిర్వహించారు. కడియంలో ఎంపీపీ, రాష్ట్ర నాయకులు వెలుగుబంటి ప్రసాద్ కార్యాలయం నుంచి ప్రారంభమైన రోడ్‌షో కడియంలో పంచాయతీ వీధి, దళితవాడ, వినాయక ఆలయంవీధి, దేవీచౌక్ సెంటర్, భాస్కరనగర్ తదితర ప్రాంతాల్లో జరిగింది. కడియంలో వినాయక ఆలయంవద్ద పలువురు బీజేపీలో చేరారు. స్థానిక దళితవాడలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం భాస్కర్‌నగర్ సెంటర్‌లో కడియపుసావరం గ్రామానికి చెందిన బీజేపీ జనసేన, టీడీపీ నాయకులు క్రేన్ సహాయంతో భారీ గజమాలవేసి పూలవర్షం కురిపించారు. అనంతరం జేగురుపాడు గ్రామంలో రోడ్‌షో నిర్వహించారు. గ్రామంలో డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాధవరాయుడుపాలెం రోడ్‌షో చేరుకుంది. గ్రామ సర్పంచ్, టీడీపీ రాష్ట్ర నాయకులు అన్నందేవుల చంటి, మాజీ ఎంపీపీ అన్నందేవుల విజయలు ఘనస్వాగతం పలికారు. ఆంజనేయస్వామికి పూజలు చేశారు. చంటి, విజయ దంపతులు దగ్గుబాటి పురందేశ్వరికి, గోరంట్ల కుమార్తె కంఠమనేని శిరీషలకు తమ ఇంటి ఆడబడుచుల మాదిరిగా తలచి చీరలను అందజేశారు. ఓం శాంతి సభ్యులు హారతి ఇచ్చి దీవెనలు అందజేశారు. అనంతరం రోడ్‌షో గుబ్బలవారిపాలెం మీదుగా మురమండ చేరుకుంది. అనంతరం దుళ్ళ గ్రామం రోడ్‌షో చేరుకుంది. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు వెలుగుబంటి ప్రసాద్, మార్గాని సత్యనారాయణ, అన్నందేవుల చంటి, గారపాటి అమరనాద్, వెలుగుబంటి నాని, ఆకుల శ్రీధర్, బొర్సు సుబ్రహ్మణ్యం, గెడ్డం శివ, ముద్రగడ జమీ, గట్టి నర్సయ్య, నాగిరెడ్డి రామకృష్ణ, పంతం గణపతి, వరగోగుల వెంకటేశ్వరరావు, ప్రత్తిపాటి రామారావుచౌదరి, దేవళ్ళ రామ్మోహనరావు, వరగోగుల సత్యనారాయణ, పాటంశెట్టి రాంజీ, కర్రి చినబాబు, తదితరులు పాల్గొన్నారు. దామిరెడ్డిపల్లి, కడియపులంక, బుర్రిలంక గ్రామాల్లో రోడ్డు షో నిర్వహించారు.

పురందేశ్వరికి తులాభారం

బీజేపీ,తెలుగుదేశం,జనసేన కూటమి రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థిని దగ్గుబాటి పురందేశ్వరికి కడియం మండలం కడియపులంకలో ముసలమ్మ ఆలయంవద్ద బుధవారం తులాభారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 100 కిలోల బెల్లంతో పురందేశ్వరికి తులాభారం చేసి పూల కిరీటాన్ని తలపై పెట్టారు. ముసలమ్మ అమ్మవారి ఆశీస్సులతో పురందేశ్వరి ఎంపీగా విజయం సాధించాలని ఆకాంక్షిస్తూ ఈ తులాభారాన్ని నిర్వహించామని నాయకులు తెలిపారు. ముందుగా పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల బుచ్చయ్యచౌదరిలు అమ్మవారికి పూజలు చేశారు.



కడియపుసావరంలో పురందేశ్వరికి, గోరంట్లకు భారీ గజమాల



నాగలిని బహూకరిస్తున్న టీడీపీ రాష్ట్ర నాయకుడు చంటి



కడియంలో పురందేశ్వరి, ఎమ్మెల్యే అభ్యర్థి గోరంట్ల రోడ్‌షో

రాష్ట్ర టీడీపీలో రాజానగరం నుంచి ఇద్దరికి చోటు

రాజానగరం, మే 1 : టీడీపీ రాష్ట్ర కార్యవర్గంలో రాజానగరం నియోకవర్గానికి చెందిన ఇద్దరు సీనియర్ నాయకులకు చోటు దక్కింది. ఈమేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కింజరావు అచ్చెన్నాయుడు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా టీడీపీ ఉపాధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న రాజానగరం మండలం పాలచర్లకు చెందిన గంగిశెట్టి సూర్య సత్యనారాయణ(చంటిబాబు)ను, కోరుకొండ మండలం బూరుగుపూడి గ్రామానికి చెందిన కంటే కేశవరావును పార్టీ రాష్ట్ర కార్యదర్శులుగా నియమించినట్లు అచ్చెన్నాయుడు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈసందర్భంగా రాష్ట్ర స్థాయిలో పదవులు పొందిన ఇరువురినీ రాష్ట్ర పార్టీ కార్యదర్శి, రాజానగరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి, జిల్లా తెలుగు యువత అధ్యక్షులు కందుల బాబూరాయుడు, టీడీపీ నాయకులు మద్దిరెడ్డి చినవెంకటేశ్వరరావు, నీలపాల అరవరాజు, మల్లిబాము, కడవిల్లి లక్ష్మి అభినందనలు తెలిపారు.

బీసీ డిక్లరేషన్‌తో ఎన్నో ప్రయోజనాలు

దివాన్‌చెరువు, మే 1 : టీడీపీ, జనసేన ఉమ్మడి మేనెఫెస్టోలోని బీసీ డిక్లరేషన్‌లో పేర్కొన్న అంశాలతో వెనుకబడిన తరగతులకు సంక్షేమం, అభివృద్ధితోపాటు రాజకీయ భాగస్వామ్యం వంటి ఎన్నో ప్రయోజనాలు చేకూరుతాయని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బత్తులనాగేశ్వరరావు (నాగు) అన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
గురువారం 2 మే 2024 | 3



దరహాసం : అభిమానులను చూస్తూ పవన్ ఆనందం



మా పవర్ స్టార్ : పవన్‌కు వేగుళ్ల పుష్పగుచ్ఛం

వైసీపీకి పొలిటికల్ హాలిడే ప్రకటించండి!



ఆలోచించి ఓటేయండి : మండపేట సభలో అభిమానులకు పవన్ పిలుపు

మండపేట, మే 1 : కోనసీమలో క్రాప్‌హాలిడే ప్రకటించినట్టుగా వైసీపీకి ఈ ఎన్నికల్లో పొలిటికల్ హాలిడే ప్రకటించాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట కేపీరోడ్డులో బుధవారం అమలాపురం ఎంపీ టీడీపీ అభ్యర్థి హరీష్ మాధుర్, మండపేట అసెంబ్లీ టీడీపీ అభ్యర్థి వేగుళ్ల జోగేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఎన్నికల సభలో మండు టెండలో పవన్ గంటపాటు మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంపైన, వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులు అక్రమాలపైనా విరుచుకుపడ్డారు. ఇక్కడ 50 రైస్‌మిల్లులు ఉన్నాయి. కానీ రైతులు నష్టాల్లో ఉన్నారు. వైసీపీ నాయకులు అమ్మకాలు సాగించే గంజాయికి మాత్రం గిట్టుబాటు ధర ఉంది. వేలకోట్ల అమ్మకాలూ సాగుతాయి. సినిమా టిక్కెట్లకు అధికారులు వస్తారు.. కానీ గంజాయి నిర్మూలనకు రారని ధ్వజమెత్తారు. ఐదేళ్లలో ఒక్కసారి కూడా రైతులకు మద్దతు ధర ఇవ్వలేదు. మూడు వేల మంది రైతులు చనిపోయారు. వ్యవసాయంలో రాయితీలు తీసేశారు. ఈ రోజున ఎందుకు ఇవ్వడం లేదని అడిగితే దాడులు తప్ప సమాధానం లేదు. 2020లో హుద్‌హుద్ తుఫాన్ కారణంగా రూ.250 కోట్ల మేర పంటనష్టం వాటిల్లినా పరిహారం ఇవ్వలేదు. తెలంగాణలో వరిసాగు పెరుగుతుంటే అన్నపూర్ణ ఆంధ్రలో మాత్రం వరి సాగు తగ్గింది. మద్దతు ధర ఇవ్వరు.. చివరకు రైతులిక్కడ క్రాప్‌హాలిడే ప్రకటించాల్సి వచ్చింది. దీనికి సమాధానంగా వైసీపీకి రాష్ట్రవ్యాప్తంగా పొలిటికల్ హాలిడే ఇవ్వాలని పవన్ పిలుపునిచ్చారు. జగన్‌కు నెలకు పది కోట్లు వంతున కపిలేశ్వరపురం, తాతపూడి, కోరుమిల్లి కేదార్లంక ఇసుక ర్యాంపుల నుంచి వెళ్లిందని ఆరోపించారు. అదే డబ్బుతో ఇప్పుడు ఓట్లు కొంటున్నాడన్నారు. జగన్.. ఇప్పుడు క్లాస్ వార్ అంటూ అందరినీ కలిపి దోచేయడం కాదు...సీఎం దోస్తున్నాడా. పవన్ దోస్తున్నాడా ప్రతి ఒక్కరూ ఆలోచించండి. ప్రకృతిలో పంచభూతాలు అందరివి. మేడే రోజున చెబుతున్నా.. సహజ వనరులపై అజమాయిషీ చేస్తే అథః పాతాళంలోకి తొక్కేస్తా..తోట త్రిమూర్తులుకూ చెబుతున్నా అంటూ పవన్ ధ్వజమెత్తారు. కూటమి అన్నదమ్ములను కలుపుతుంటే వైసీపీ మాత్రం జగన్ కుటుంబాన్ని విడదీస్తోందని పవన్ అన్నారు. కొత్తపేటలో బండారు బ్రదర్సు ఇద్దరు వేర్వేరుగా ఉంటే.. వారిని కూటమి ఒక్కటి చేసిందన్నారు. జగన్ మాత్రం తన కుటుంబంలో చెల్లిని, తల్లిని విడదీస్తే తమ కూటమి అన్నదమ్ములను కలిపిందన్నారు. తనకు ఎవరిమీద ద్వేషం ఉండదన్నారు. కాపు కులం వాడుకున్న ఇక్కడి వైసీపీ అభ్యర్థి తోట కాపులకు చేసిందేమీ లేదన్నారు. ద్రాక్షారామలో దేవదాయ శాఖకు చెందిన భూమిని కాపు కమ్యూనిటీ హాల్ కోసం సేకరిస్తే ఆ భూమి తోట చేతుల్లోకి వెళ్లిందన్నారు. కాపు యువతనుద్దేశించి మాట్లాడుతూ మీరు పాతతరంలాగా మోసపోకండని హితవు పలికారు.



వీళ్లకే ఓటేయండి : వేదికపై పవన్‌తో అమలాపురం ఎంపీ అభ్యర్థి హరీష్, ఎమ్మెల్యే అభ్యర్థులు వేగుళ్ల, నల్లమిల్లి, బండారు, సుభాష్

రామచంద్రపురంలో 30 ఏళ్లపాటు శత్రువులుగా ఉన్న ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, తోట త్రిమూర్తులు కలవడం వారి అవకాశవాదానికి అద్దంపడుతోందన్నారు. ఈ ఇద్దరు నేతలు జొన్నాడ, యానాం మధ్య ఏటిగట్టును ఆధునీకరించడంలో ఎందుకు చొరవ చూపలేకపోయారని ప్రశ్నించారు. వారిద్దరూ రాజకీయ అవసరాలకు కలిశారు. తోట జనసేనలోకి రావడం లేదు. నాకు సంకేతాలు పంపలేదని పవన్‌కల్యాణ్ స్పష్టంచేశారు. మండపేటలో ఓ ప్రైవేటు పాఠశాలలో జరిగిన వివాదాన్ని ప్రస్తావిస్తూ కూటమి ఉంటే అలా జరుగుతుందా, కూటమి ప్రభుత్వం ఉంటే తాను తాట తీస్తానని పేర్కొన్నారు. వైసీపీ కాకినాడ సిటీ అభ్యర్థి ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిలో మూడు పదవులు ఉన్నాయని, ఇప్పుడు వారే రైతులను దోచేస్తున్నారని ఆరోపించారు. కూటమి అభ్యర్థులకు ప్రజలు గెలిపించాలని పిలుపునిచ్చారు. వైసీపీని తరిమి తరిమికొట్టాలన్నారు. నియోజకవర్గం నలుమూలల నుంచి కూటమి నేతలు, జనసేన ఇన్‌చార్జిలు వేగుళ్ల లీలాకృష్ణ, పోలిశెట్టి చంద్రశేఖర్, బండారు శ్రీనివాసరావు, మునిసిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, నల్లమిల్లి వీర్రెడ్డి, బీజేపీ నేత కోటిపల్లి సాయిరాం, టీడీపీ నేత వి.సాయికుమార్‌బాబు, అధిక సంఖ్యలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొన్నారు.



- మండపేటలో పవన్‌కల్యాణ్ పిలుపు
- రైతులకు మద్దతు ధర లేదు..
- గంజాయికి మాత్రం ఉంది
- సహజ వనరులపై అజమాయిషీ చేస్తే తొక్కేస్తా
- వైసీపీ అభ్యర్థి తోట త్రిమూర్తులుపైనా ధ్వజం
- తోట, పిల్లి కలయిక రాజకీయ అవకాశవాదం
- కూటమి అభ్యర్థులను గెలిపించండి

పవన్‌కు ఘనస్వాగతం

మండపేటలో జరిగిన బహిరంగ సభకు హెలికాప్టర్‌లో వచ్చిన జనసేనాని పవన్‌కల్యాణ్‌కు జనసేన, టీడీపీ నేతలు ఘనస్వాగతం పలికారు. మండపేట బైపాస్‌రోడ్డులో ఉన్న హెలిపాడ్ వద్ద పవన్‌కు మండపేట కూటమి అభ్యర్థి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, కొత్తపేట, రామచంద్రపురం, అనపర్తి కూటమి అభ్యర్థులు బండారు సత్యానందరావు, వాసంశెట్టి సుభాష్, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అమలాపురం ఎంపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ తదితరులు స్వాగతం పలికారు. అనంతరం పవన్ బైపాస్ రోడ్డు నుంచి భారీ బైక్ ర్యాలీతో కలవపువ్వు సెంటరుకు చేరుకుని అక్కడ జరిగిన బహిరంగ సభలో పాల్గొన్నారు. సభ ముగిసిన తర్వాత నేతలు ఆయన విశాఖకు బయలుదేరి వెళ్లారు.

పెంచుకుంటూపోతాం.. ఇదా అర్థం..!?



ఆ చేత్తో ఇచ్చి.. ఈ చేత్తో దోపిడీ

ఇదే వైసీపీ సర్కారు సంక్షేమం మతలబు

ఐదేళ్లూ బాదుడే.. బాదుడు

- సామాన్య, మధ్యతరగతి వర్గాలన్నీ చిత్తు
- అందుబాటులో లేని నిత్యావసరాల ధరలు
- విద్యుత్ బిల్లులు, ట్రూఅప్ చార్జీల పేరిట భారం
- ఇంటి పన్ను, రిజిస్ట్రేషన్ చార్జీల్లోనూ అదే బాదుడు
- చివరకు చెత్త పన్ను పేరిటా నరకం

జగన్ పాలన ఐదేళ్లూ.. పేద, సామాన్య, మధ్యతరగతి వర్గాలకు దినదిన గండమే. తెల్లారితే రోజునెలా నెట్టుకురావాలో అనే దిగులు.. ఆర్థికంగా నిత్యం నలిగిపోవడమే. నెల జీతంతోనో, కనీస వేతనంతోనో, రోజు కూలీతోనో బతుకుబండిలాగే గడిచిన అయిదేళ్లూ పడరాని పాట్లు పడ్డారు. రోజురోజుకు పెరిగిపోతున్న ధరలు ఓవైపు. ప్రభుత్వమే ఆ పన్ను ఈ పన్ను అంటూ పెంచడంతోపాటు విద్యుత్ చార్జీలు మొదలుకొని అన్ని రకాల చార్జీలను అమాంతం పెంచేయడం ఆయా వర్గాలను ఊపిరిసలపనివ్వలేదు. నిత్యావసర సరుకులు కొనాలంటే భయం.. కరెంటు బిల్లు వస్తే గుండెదడ.. ఇంటిపన్నులు, ఆస్తి పన్నులు, రిజిస్ట్రేషన్ల చార్జీలు.. చివరకు చెత్త పన్ను అంటూ బడుగుజీవుల కష్టాన్నీ పీల్చేసిన వైనాలు ఎన్నో. పెంచుకుంటూ పోతాం.. అని జగన్ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ. అది సంక్షేమ పథకాలకే పరిమితం కాలేదు.. ఇలా ఎడాపెడా చార్జీలు, ధరల పేరిట ఆ జనం నుంచి మళ్లీ లాగేసిన సిత్రాలు చాలా ఉన్నాయి. అందులో కొన్ని...

ఇంధన ధరపై తగ్గేదేలే..

పిఠాపురం : ఒక్క మన రాష్ట్రంలోనే పెట్రో ధరలు భగ్గుమంటున్నాయి. 2019 మేలో లీటర్ పెట్రోల్ ధర రూ.79.07, డీజిల్ రూ.73 ఉండగా ప్రస్తుతం పెట్రోల్ రూ.109.31, రూ.97.17లకు పెరిగింది. దేశంలోనే ఈ ధరలు అధికం. రాష్ట్రంలో వివిధ రకాల పన్నులతో పాటు సర్‌చార్జీలను విధించడంతో ధరలు అధికంగా ఉన్నాయి. పలు రాష్ట్రాలు పన్నులు తగ్గించినా రాష్ట్రంలో మాత్రం తగ్గించేందుకు వైసీపీ సర్కారు అంగీకరించలేదు. కాకినాడ జిల్లాకు చెంతనే ఉన్న యానాంలో పెట్రోల్ లీటరు ధర రూ.94.84 ఉండగా, డీజిల్ ధర 84.68గా ఉంది. అంటే మన రాష్ట్రంతో పోల్చుకుంటే అక్కడ లీటరు పెట్రోల్ రూ.14.47, డీజిల్ రూ.12.49 తక్కువగా ఉంది.

'నిత్యావసరాలు'.. ఆకాశంలో..

పిఠాపురం, మే 1 : పప్పులు, ఉప్పులు, నూనెలు, మసాలా సరుకులు, పాలు ఇలా ప్రతి నిత్యావసర వస్తువు ధర ఆకాశమే హద్దుగా పెరిగిపోయాయి. అడ్డూఅదుపూ లేకుండా ధరలు పెరుగుతున్నా ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం కనీస చర్యలు తీసుకోవడంలో విఫలమైంది. బతుకు భారమై ప్రజలు అవస్థలు పడుతున్నా పట్టలేదు. మేము అధికారంలోకి రాగానే అధిక ధరలపై ఉక్కుపాదం మోపుతాం. ధరలన్నింటినీ నియంత్రిస్తాం. ఇది ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ చెప్పిన మాటలు. అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో ఏటా పెరుగుతూనే ఉన్నాయి. కొన్ని రకాల నిత్యావసరాలు 50 నుంచి 100 శాతం, మరి కొన్ని 100 నుంచి 300 శాతం వరకూ పెరిగాయి. ఉల్లిపాయల ధరలు కిలో రూ.230 వరకూ పెరిగినా చలనం కనిపించలేదు. టమాటాలు కిలో రూ.140కి పెరిగినా ప్రభుత్వం జోక్యం చేసుకోలేదు.ఐదేళ్ల కిందట కందిపప్పు ధర కిలో రూ.70-90 ఉండగా ఇప్పుడు రూ.200కి పెరిగింది. మినపప్పు ధర రూ.60 ఉండగా ప్రస్తుతం రూ.125, పెసరపప్పు రూ.70 నుంచి రూ.120, సన్‌ఫ్లవర్ ఆయిల్ కిలో గతంలో రూ.75 ఉండగా రూ.200 దాటి విక్రయించారు. ప్రస్తుతం రూ.120లు ఉంది. పెరగగా, పామాయిల్ రూ.55 నుంచి రూ.100కు పెరిగింది. బియ్యం సన్నరకం కిలో రూ.28 ఉండగా ఇప్పుడు రూ.56కి పెరిగింది. జీలకర్ర కిలో రూ.150 ఉండగా ఇప్పుడు ఏకంగా రూ.600-700 వరకూ పెరగగా, వెల్లుల్లి రూ.100 నుంచి 350కి పెరిగాయి. పాలు, ఇతర నిత్యావసరాలు, కూరగాయలు సహా నిత్య జీవనంలో ఉపయోగపడే అన్ని వస్తువుల ధరలు భారీగా పెరుగుదల బాటలోనే ఉన్నాయి. అయినా ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం వాటి నియంత్రణపై దృష్టి పెట్టలేదు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పలేదు.

జనం ఆస్తి.. జగన్ పెత్తనం!

జగన్ సర్కారు వచ్చిన తర్వాత రిజిస్ట్రేషను చార్జీలను అమాంతంగా పెంచేసింది. ఈ ఐదేళ్లలో భూములు/స్థలాల ధరలు ఏకంగా 200 శాతానికి పైగా పెరిగిపోయాయి. మరోవైపు కార్డ్‌ప్రైమ్ పేరుతో జిరాక్స్ పత్రాలను హక్కుదారుడి చేతిలో పెట్టే పనికి తెరతీశారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక క్రమం తప్పకుండా 'బాదుడు' మాత్రం బాదేశారు. 2020, 2022, 2023 మే నెలలో అర్బన్, రూరల్ ఏరియాల్లో అప్పటి వరకూ ఉన్న అధిక ధరలకు మరో 50 శాతం జోడించారు. అపార్ట్‌మెంట్లలో చదరపు అడుగుకు సుమారు 30 శాతం మేర అధికం చేశారు. జిల్లాల పునర్వవస్థీకరణ 2022 ఏప్రిల్‌లో జిల్లా కేంద్రాలతో పాటు డిమాండ్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ధరలను పెం చింది. ఆ తర్వాత 2023 జూన్ 1 నుంచి మళ్లీ భూములు, రిజిస్ట్రేషన్ల ధరలు పెంచుతూ ఉత్తర్వులు అమల్లోకి వచ్చాయి. దీంతో ఐదేళ్ల కిందట రూ.10 వేలు ఉండే చదరపు గజం ప్రభుత్వ ధర ఇప్పుడు రూ.30 వేలకు చేరింది. మరోవైపు భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా ఆస్తి పత్రాలు ఒరిజినల్స్ ప్రభుత్వం వద్ద ఉంచుకొని జిరాక్స్ కాగితాలు హక్కుదారుడి చేతిలో పెట్టే బృహత్తర 'పథకాన్ని' జగన్ ప్రభుత్వం తెరపైకి తీసుకొచ్చింది. కార్డ్‌ప్రైమ్ 2.0 పేరుతో కకావికలానికి తెరతీసింది. ఎన్నో ఏళ్లగా వస్తున్న పుస్తకంలో వేలిముద్రల విధానాన్ని తీసేసింది.డిజిటల్ రూపంలో సంతకంలో తేడా వస్తే భౌతికంగా నిరూపణకు అవకాశమే లేదు.ఎక్కడో విదేశాల్లో ఉంటూ ఇక్కడ మన బ్యాంకు అకౌంట్‌లో డబ్బులను సైబర్ నేరగాళ్లు దోచుకుపోతున్నారు.మరి భూములు/స్థలాల రిజిస్ట్రేషన్లలో డిజిటల్ సంతకాలనే నమ్ముకోవడంలో 'అంతర్యం'ఏమిటో జగన్ సర్కారుకెరుక. - రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి

చివరకు చెత్త పన్ను పేరిటా బాదుడే

రాజమహేంద్రవరం సిటీ : రాజమహేంద్రవరం నగరం ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలకు వాణిజ్య కేంద్రం. ఈ నగరం వైశాల్యం 44 చదరపు కిలోమీటర్లు.50 డివిజన్లు, 95 వేల నివాస గృహాలు, 20 వేల కమర్షియల్ భవనాలతో నగరం విస్తరించి ఉంది.ఏటా పన్నుల రూపేణా రాజమహేంద్రవరానికి రూ.45 కోట్లు డిమాండ్ ఉంది. ఈ నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న కమర్షియల్, రెసిడెన్షియల్ భవనాలు,వ్యాపార సముదాయాల పన్నులను వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెంచివేసింది. పన్నులు చెల్లిస్తున్న వారి భవనాలను బట్టి ప్రతి ఏటా 0 నుంచి 15 శాతం అదనంగా పన్నులను పెంచారు. పన్నుల విధా నంలో 5,7,10,15 శాతం వరకూ పెంచుకుంటూపోయారు.దీంతో నివాస,వాణిజ్య పన్నుల భారం కూడా ప్రజలపై పడింది.రాష్ట్ర వ్యాప్తంగా పన్నులు పెంపు చేశారు. చివరకు చెత్త పన్ను పేరిట ఒక కొత్త పన్ను విధానాన్నీ వైసీపీ సర్కారు అమల్లోకి తెచ్చింది

విద్యుత్ చార్జీల మోత మోగించారు..

పిఠాపురం : వైసీపీ పాలనలో విద్యుత్‌చార్జీల మోత మోగించారు. బిల్లుల భారం మూడు రెట్లు పెరిగింది. సర్దుబాట్లు పేరుతో విధించిన సర్‌చార్జీలు ప్రజలకు షాక్‌ను ఇచ్చాయి. ఐదేళ్ల క్రితం నెలకు రూ.200-300 మధ్య వచ్చే విద్యుత్ బిల్లులు ప్రస్తుతం రూ.500నుంచి రూ.750 వరకూ వస్తున్నాయి. విద్యుత్ చార్జీలను ఐదేళ్లపాటు పెంచబోనంటూ ఎన్నికల ముందు ప్రకటించిన జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు షాక్ ఇచ్చారు. శ్లాబుల మార్పుతో మొదలు పెట్టి సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారం మోపారు. విద్యుత్ కొనుగోళ్ల భారాన్ని ప్రజలపైకి నెట్టి ప్రభుత్వం చేతులు దులుపుకుంది. దీనివల్ల ఒకే సమయంలో నాలుగు సర్దుబాటు చార్జీలను ప్రజలు చెల్లిం చారు. ఏకంగా విద్యుత్ చార్జీల శ్లాబుల సర్దుబాటు, వినియోగ చార్జీలు, సర్దుబాటు చార్జీలు కలుపుకుని బిల్లులు 300శాతంపైగా పెరగడం, పలుమార్లు తనిఖీల్లో లోడు అధికంగా ఉందంటూ చార్జీలు చెల్లించాలని బిల్లులతో కలిపి ఇవ్వడంతో చెల్లింపులకు అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

మూడు సార్లు రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేశారు..



సామాన్యుడు భూమి కొనుగోలు చేయలేని విధంగా రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచేశారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మూడు దఫాలు భూమి రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచింది. అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో భూమి విలువ పది నుంచి 20 శాతానికి పెరిగింది.
- బీవీ.సుబ్రహ్మణ్యేశ్వరరావు, న్యాయవాది, ముమ్మిడివరం

చెత్తపై పన్ను వేసిన ఘనత జగన్‌దే..



ఐదేళ్ల వైసీపీ పాలనలో విద్యుత్ చార్జీలు రెట్టింపు చేశారు. ఏకంగా 9 సార్లు చార్జీలు పెంచిన ఘనత జగన్‌దే. ఇంటి పన్ను, చెత్త పన్ను పెంచారు. ఇవి సామాన్యులకు పెనుభారంగా మారాయి. చెత్తపై పన్ను వేసిన ఘనత వైసీపీకే దక్కుతుంది.
- సుంకర శ్రీనివాస్, సీహెచ్ గున్నేపల్లి

ఇష్టానుసారంగా నిత్యావసరాల ధరలు పెంపు



నిత్యావసర ధరలపై నియంత్రణ లేక ఇష్టానుసారం పెరిగిపోతున్నాయి.గత టీడీపీ ప్రభుత్వంలో రూ.100లు ఉండే కందిపప్పు ప్రస్తుతం రూ.200 ఉంది. అన్ని ధరలు రెట్టింపు పెరిగిపోయాయి. సామాన్య ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.
- కె.మంగాదేవి, గృహిణి, ముమ్మిడివరం

ఇంధన ధరల భారం మోపారు..



సామాన్యులపై ఇంధన ధరల భారం మోపారు. అన్ని రాష్ట్రాలు తగ్గించినా మన రాష్ట్రంలో మాత్రం తగ్గించలేదు.ఇంధనంపై రకరకాల పన్నులు విధించడంతో సామాన్యుడు తట్టుకో లేకపోతున్నారు. వినియోగదారులపై భారం పెరిగింది.
- గోదశి గణేష్, పల్లవారిపాలెం, టీవీ మెకానిక్

వైసీపీ ప్రభుత్వంలో బాదుడే..బాదుడు



ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో ప్రజలపై బాదుడే బాదుడు. నా ఊహ తెలిసిన తర్వాత ఇప్పటి వరకు చెత్తపై పన్ను కట్టడం తెలిదు. వైసీపీ ప్రభుత్వంలో మాత్రం చెత్తపై పన్ను వేశారు. దీనికి తోడు కరెంట్ బిల్లులు నిత్యావసర ధరలు పెంచేశారు. మళ్లీ ఇదే ప్రభుత్వం ఉంటే ఇక సామాన్యులు బ్రతకలేరు.
- చోడే రామచంద్రమూర్తి, మారేడుబాక, మండపేట మండలం

ఐదేళ్లలో అన్ని ధరలు భారీగా పెంచేశారు..



నిత్యావసరాల ధరలు పెరిగిపోయాయి. పప్పులు, ఉప్పులు ఐదేళ్లలో భారీగా పెరిగాయి. వంట గ్యాస్, కరెంట్ బిల్లులు, చెత్తపై పన్ను ఇబ్బుముబ్బడిగా పెంచేశారు. వైసీపీ ప్రభుత్వంలో సామాన్యుడు బతకలేని పరిస్థితి.
- చల్లా నాగమణి, మండపేట

గృహ సామగ్రి ధరలు పెరిగాయి..



చిన్న ఇల్లు కట్టుకుందామంటే పెరిగిన గృహ సామగ్రి ధరలు చూసి వెనకడుగు వేయాల్సి వస్తుంది. ప్రభుత్వం ధరలు అదుపు చేయకపోతే గ్రామీణ ప్రాంత ప్రజలకు సొంతిళ్లు కూడా ఉండవు.
- సోముల ఉపేంద్ర, బి.కొత్తూరు, తునిరూరల్

ఇంటి పన్నులు అమాంతం పెంచేశారు..



గత ఐదేళ్లలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఒరిగిందేమీ లేదు. ఇంటిపన్ను పెంచేశారు. గతంలో ఇంటిపన్ను రూ.800లు చెల్లిస్తుంటే ఇప్పుడు ఏకంగా రూ.1150కు చేరింది.విద్యుత్ బిల్లులదీ ఇదే పరిస్థితి. కట్టలేకపోతున్నాం. గతంలో రూ.800 వస్తే నేడు రూ.1200 చెల్లిస్తున్నాం. ఇంట్లో ఏసీ కూడా లేదు.
- సీహెచ్ మధుకిరణ్, బి.కొత్తూరు, తునిరూరల్

ఐదేళ్లలో అన్ని ధరలూ పెంచేశారు..



గత ఐదేళ్లలో కూరగాయలు, కందిపప్పు, నూనె, మిర్చి ఇతర ధరలు పెరిగిపోతూనే ఉన్నాయి. గత ప్రభుత్వంలో నిత్యావసర సరుకుల ధరలు అదుపులో ఉండేవి.నేడు ధరలు పెరిగి అవస్థలు పడుతున్నాం.
- బి.నరేష్, తుని

నేడు హోం ఓటింగ్!

తొలి విడతకు అంతా సిద్ధం.. 8న మలివిడత.. 13నా ఓటేయొచ్చు

85 ఏళ్లు దాటినవారు, పీడబ్ల్యూడీ ఓటర్లకు ఇంటి వద్దే ఓటు చాన్స్

రాజమహేంద్రవరం, మే 1 (ఆంధ్రజ్యోతి): పోలింగ్ బూత్‌లకు రాలేని స్థితిలో ఉన్న 85 ఏళ్ల దాటినవారు, పీడబ్ల్యూడీ ఓటర్లు హోంఓటింగ్ విధానంలో ఇంటి వద్దే ఓటు వేసే అవకాశం ఉంది. తొలివిడతగా గురువారం, రెండో విడతగా ఈనెల 8న ప్రత్యేక బృందాలు ఆయా ఓటర్ల వద్దకు వెళ్లి ఓటింగ్ ప్రక్రియను నిర్వహిస్తాయని తూర్పుగోదావరి జిల్లా ఎన్నికల అధికారిణి, కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తెలిపారు. బుధవారం రాత్రి ఆమె ఒక ప్రకటన జారీచేశారు. ఎన్నికల కమిషన్ నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ఈ హోంఓటింగ్ ప్రకియ మొదలు పెట్టామన్నారు. జిల్లాలో హోం ఓటింగ్‌కు అంగీకరించిన వారు మొత్తం 1306 మంది ఉండగా, అందులో 85 ఏళ్ల దాటినవారు 648 మంది, పీడబ్ల్యూడీ ఓటర్లు 658 మంది ఉన్నారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాల పరిధిలో ఈ విధానం కోసం 400 మంది సిబ్బందితో 69 బృందాలు ఏర్పాటుచేశామన్నారు. ఈ రెండు విడతల్లో ఓటు వినియోగించుకోకపోతే మే 13న కూడా ఓటుహక్కును వినియోగించుకోవచ్చన్నారు. హోంఓటింగ్ ప్రక్రియ అంతా వీడియో రికార్డింగ్ చేస్తామని జిల్లా ఎన్నికల అధికారిణి మాధవీలత తెలిపారు. అనపర్తిలో 85 ప్లస్ ఓటర్లు 186, దివ్యాంగులు 222 ఉండగా, హోంఓటింగ్ కోసం 147 మందితో 21 బృందాలు ఏర్పాటుచేశారు. రాజానగరంలో 85 ప్లస్ 33 మంది, దివ్యాంగులు 67 మంది ఉండగా, వారికోసం 35 మందితో 7 బృందాలు ఏర్పాటు చేశారు. రాజమండ్రి సిటీలో 85 ప్లస్ 142 మంది, దివ్యాంగులు 65 మంది ఉండగా, వారికోసం 40 మందితో పది బృందాలు ఏర్పాటుచేశారు. రాజమహేంద్రవరం రూరల్‌లో 85 ప్లస్ 51మంది, దివ్యాంగులు 56 మంది ఉండగా, వారికోసం 30 మందితో 5 బృందాలు ఏర్పాటుచేశారు. కొవ్వూరులో 85 ప్లస్ 66 మంది, దివ్యాంగులు 66 మంది ఉండగా, వారికోసం 40 మందితో 8 బృందాలు ఏర్పాటుచేశారు. నిడదవోలులో 85ప్లస్ 130మంది, దివ్యాంగులు 145 మంది ఉండగా, వారి కోసం 72 మందితో 12 బృందాలు ఏర్పాటుచేశారు. గోపాలపురంలో 85ప్లస్ 40 మంది, దివ్యాంగులు 37 మంది ఉండగా, వారి కోసం 36 మందితో 6 బృందాలు ఏర్పాటుచేశారు. హోం ఓటింగ్ ప్రక్రియ అంతా వీడియో రికార్డింగ్ చేస్తామని జిల్లా ఎన్నికల అధికారి తెలిపారు. కాగా హోంఓటింగ్‌కు కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లోనూ ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఆయా జిల్లాల ఎన్నికల అధికారులు తెలిపారు.

గాజు గ్లాసు పోయి.. గ్యాస్ సిలిండర్ వచ్చే
ఫోర్జరీ సంతకాల కేసులో ఇద్దరి అరెస్టు
ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి

- 6లో

కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్రాభివృద్ధి

టీడీపీ-జనసేన-బీజేపీ కొవ్వూరు అభ్యర్థి ముప్పిడి



ధర్మవరంలో ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, మే 1: కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని టీడీపీ-జనసేన-బీజేపీ నియోకజకవర్గ అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం ధర్మవరంలో బుధవారం ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో బాబు-ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముప్పిడికి గ్రామంలో మూడు పార్టీ కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించి, స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ఉమ్మడి మేనిఫెస్టోను వివరించారు. ఇంట్లో ఎంతమంది విద్యార్థులుంటే అందరికీ తల్లికి వందనం, సామాజిక పింఛను రూ.4 వేలు, దివ్యాంగ పింఛను రూ.6 వేలు, మహిళలకు ఉచితంగా ఏడాదికి 3గ్యాస్ సిలిండర్లు, ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, 18ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1500, ప్రతి రైతుకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు.

టీడీపీ ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట

కూటమి గోపాలపురం ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి



దేవరపల్లి, మే 1: టీడీపీ ప్రభుత్వ హయాంలోనే మహిళలకు ఆస్తిలో సమాన హక్కులు కల్పించిందని, అన్ని రంగాల్లో పెద్దపీట వేసిందని టీడీపీ-జనసేన-బీజేపీ నియోకజకవర్గ అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. దేవరపల్లిలో కరుటూరి ఫంక్షన్‌హాలులో నియోజకవర్గ తెలుగు మహిళలతో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని అవినీతి, ఆరాచక పాలన అంతమొందించడానికి, జగన్‌ను చిత్తుగా ఓడించడానికి మహిళాశక్తి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరి కుమార్తె నివేదిత మాట్లాడుతూ మహిళలందరూ సంఘటితంగా వైసీపీ ప్రభుత్వాన్ని గద్దె దించాలని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తేనే రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా నేతలు కొయ్యలమూడి సుధారాణి, కరుటూరి ఉషారాణి, రాష్ట్ర మహిళా బీజేపీ అధ్యక్షురాలు నిర్మలా కిషోర్, సృజనదేవి, కాకర్ల రామతులసి, మెంటిమి అమరావతి, బాదంపూడి ఇందిర, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇంటింటికీ ఓటరు స్లిప్‌ల పంపిణీ

తాళ్లపూడి, మే 1: కొవ్వూరు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అశుతోష్ శ్రీవాత్సవ ఆదేశాల మేరకు ఇంటింటికీ ఓటరు సమాచార పత్రాలను పంపిణీ చేస్తున్నట్టు సూపర్‌వైజర్ జోడాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఓటరు స్లిప్పులను బూత్‌లెవెల్ అధికారుల ద్వారా పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశామని, తమ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి అందిస్తారన్నారు. ఈ నెల 4వ తేదీ లోపు మండలంలో ఓటరు స్లిప్పుల పంపిణీ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో డీటీ భారతి, సీనియర్ అసిస్టెంట్ సీతారామరాజు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

కార్మిక హక్కులు హరణం

- సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుందరబాబు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై విమర్శ
- ఘనంగా ప్రపంచ కార్మిక దినోత్సవం
- మేడే పతాకాల ఆవిష్కరణ.. అమరవీరులకు నివాళి

కొవ్వూరు, మే 1: ఎన్నో పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు విమర్శించారు. ప్రపంచ కార్మిక దినోత్సవం(మే డే)ను బుధవారం పలుచోట్ల సీఐటీయూ, అంగన్వాడీ, ఆశా, భవన నిర్మాణ, కార్మిక సంఘం, మున్సిపల్, రిక్షా, జట్టు వర్కర్స్, ఫ్యాక్టరీ వర్కర్స్ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో సీఐటీయూ, స్థూపం వద్ద జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు, కోరమండల్ కాంక్రీట్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో బీరా రవి, అల్లూరి సీతారామరాజు విగ్రహం, పుంతలో ముసలమ్మ గుడి వద్ద సాయి గణేష్ పెయింటర్స్ యూనియన్ వద్ద సిద్దిరెడ్డి బాపిరాజు, బాపూజీ కూగాయల మార్కెట్ జట్టు కార్మికులు, కొవ్వూరమ్మ ఆలయం, చైతన్య తాపీ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద మైగాపుల నాగేశ్వరరావు, మండలంలోని సీతంపేట, విజ్జేశ్వరం, వాడపల్లి, పశివేదల, దొమ్మేరు గ్రామాల్లో ఆయా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు మేడే పతాకాలను ఎగురవేశారు. చికాగో అమరవీరులకు నివాళులర్పించారు. సుందరబాబు మాట్లాడుతూ మేడే స్ఫూర్తితో కార్మికుల హక్కులకు భంగం కలిగించి లేబర్‌కోడ్‌లు రద్దు అయ్యే వరకు, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టం సెస్సు నిధులను కార్మికుల సంక్షేమానికి వినియోగించే వరకు పోరాడుతామన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటుపరం కాకుండా, కార్మికులకు కనీస వేతనాలు అమలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కార్మికులంతా ఐక్యంగా పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్.మాణిక్యాంబ, మద్దుకూరి దొరయ్య, పెనుమాక జయరాజు, కె.వీరబాబు, మాణికిరెడ్డి హరిబాబు, జొన్నల రాంబాబు, మైగాపుల నాగేశ్వరరావు, రేఖ నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకల్లో పాల్గొన్న పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నంబూరి సూర్యవెంకట మహర్షి మాట్లాడుతూ పదేళ్లుగా దేశంలో కార్మిక హక్కులు హరించబడుతున్నాయన్నారు. ఉపాధి లేక అసంఘటితరంగ కార్మికులు అల్లాడిపోతున్నారన్నారు. వారందరికీ ఉపాధి కల్పించి ఆదుకోవాలన్నారు. పంగిడిలో ఐఎఫ్‌టీయూ నాయకుడు పి.నాగేశ్వరరావు కార్మిక పతాకాన్ని ఎగురవేశారు. క్వారీ, లారీ వర్కర్లకు యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనల మేరకు వేతనాలు చెల్లించడంలేదన్నారు. నాలుగు లేబర్‌కోడ్‌లు రద్దుచేసి, కార్మికులకు పనిచేసే ప్రాంతాల్లో చట్టబద్ధమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో గాడి రమేష్, శ్యాం, పోసియ్య తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: తాళ్లపూడి బస్టాండు సెంటరు జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ అధ్యక్షుడు దూళ్ల గోపాలరావు జెండాను ఆవిష్కరించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు నరసింహమూర్తి మాట్లాడుతూ కార్మికుల సంక్షేమం కోసం సమష్టిగా పోరాడాలని, కార్మికులు సంఘటితంగా ఉండాలని అన్నారు. అనంతరం కార్యదర్శి ఉప్పే కేదారేశ్వరరావు ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో దూళ్ల మునేశ్వరరావు, గోలి మణికంఠ, గూడపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ప్రక్కిలంక ఆటోనగర్ సెంటరులో మేడే సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. పైడిమెట్టలో ఎస్ఎంయూ ఆధ్వర్యంలో జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు కొడమంచిలి నాగరాజు, దేవరపల్లి రవి, కొడమంచిలి చంద్రశేఖర్ పాల్గొన్నారు. పెద్దేవం సినిమాహాల్ సెంటరులో గెడ్డం విజయభాస్కరరావు ఎమ్మార్పీఎస్ నాయకుడు గణపాల ఆకాష్ ఆధ్వర్యంలో మజ్జిగ వితరణ చేశారు.

నిడదవోలు: నిడదవోలులో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో జరిగిన మేడే వేడుకలకు ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖా భాస్కరరావు ముఖ్య అతిథిగా విచ్చేశారు. అలాగే పట్టణంలో సీఐటీయూ నాయకుడు జువ్వల రాంబాబు ఆధ్వర్యంలోను ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మకుమార్ ఆధ్వర్యంలోను మేడే వేడుకలు ఘనంగా జరిగాయి. అరుణ పతాకాలను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో ఆయా కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



తాళ్లపూడిలో మేడే వేడుకల్లో సీఐటీయూ కార్మికులు



చాగల్లులో మేడే వేడుకలో పాల్గొన్న కార్మికులు

దేవరపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో వివిధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్.భగత్, ప్రగతిశీల కార్మిక సంఘం నాయకుడు ఎస్‌కే మస్తాన్, సీపీఎం నాయకుడు ఉండవల్లి కృష్ణారావు మాట్లాడుతూ కార్మికవర్గ ఐక్యతతో 8గంటల పనివిధానం, కనీసవేతనం అమల్లోకి రావడానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను కాపాడుకోవల్సిన బాధ్యత కార్మికవర్గంపై ఉందన్నారు. కార్యక్రమాల్లో లక్ష్మి, మల్లిపూడి వెంకటలక్ష్మి, పిన్నమని సత్యనారాయణ, రత్నాజీ పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఆటో డ్రైవర్లు, హమాలీలు నిర్వహించిన మేడే వేడుకల్లో జెండాను ఎగుర వేసి కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. అనంతరం మిఠాయిలు పంచారు.

చాగల్లు: చాగల్లులో జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జెండా స్థూపం వద్ద జెండాను కంకటా బుద్ధుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు కేకే దుర్గారావు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను తీవ్రంగా విమర్శించారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.రమేష్, కొండయ్య, కె.తాతారావు, కె.పోశమ్మ, ఎస్‌కే ఆదాం తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని తాడిపర్రులో జరిగిన కార్మికుల సమావేశంలో సీఐటీయూ జిల్లా నాయకుడు గుండుమేని జగన్నాథం మాట్లాడుతూ కార్మిక సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని, కార్మిక రంగానికి నిధులు కేటాయించాలని, సంక్షేమ బోర్డు ద్వారా పథకాలు అమలుచేయాలని డిమాండ్ చేశారు. తొలుత సీఐటీయూ జెండాను ఎగురవేశారు. ర్యాలీ జరిపారు. కార్యక్రమంలో దేవరపల్లి వినాయకుడు, ఆరిగెల సూరిపండు, గారపాటి శ్రీను, తోట చక్రధర్, అబ్బు వెంకటేశ్వరరావు, పోలుమాటి వెంకటేశ్ పాల్గొన్నారు. ఉండ్రాజవరం, మోర్త తదితర గ్రామాల్లో కార్మికులు మేడే వేడుకలు నిర్వహించారు.

కూటమిని గెలిపించండి

నిడదవోలు ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గేష్ పలుచోట్ల ఇంటింటా ప్రచారం



కొవ్వూరులో బొట్టుపెట్టి ప్రచారం చేస్తున్న రాధారాణి, తెలుగు మహిళలు

ఉండ్రాజవరం, మే 1: రాష్ట్రాభివృద్ధికి కూటమి విజయం అవసరమని టీడీపీ-జనసేన-బీజేపీ నియోకజకవర్గ అభ్యర్థి కందుల దుర్గేష్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని వెలగదుర్రు, మోర్త గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రం అన్నిరంగాల్లో వెనుకబడి పోయిందని, వైసీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి చేయలేదని విమర్శించారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్మాణ రంగాన్ని సర్వనాశనం చేసి, కార్మికులను రోడ్డున పడేసిందని విమర్శించారు. గాడితప్పిన పాలనను మరలా ప్రజాపాలన సాగించాలంటే చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి అవసరమన్నారు. ప్రచారంలో నాయకులు, ప్రజలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని నాయకుల్లో ఉత్సాహం మరింత పెంచారు. మోర్తలో గుర్రపు బండిపై ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దుర్గేష్, శేషారావుకు క్రేన్ సహాయంతో గజమాలను వేశారు. వారు అంబేడ్కర్, జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బోగవల్లి ప్రసాద్, సింహాద్రి రామకృష్ణ, రాచమళ్ల శ్రీనివాస్, బూరుగుపల్లి శ్రీనివాసరావు, కుడప చక్రపాణి, మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని కాపు కళ్యాణ మండపంలో మేడే సందర్భంగా భవన నిర్మాణ కార్మికుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు పోరాడి సాధించుకున్న సంక్షేమ నిధిని పలు పథకాలక దారి మళ్లించి సీఎం జగన్ భవన నిర్మాణ కార్మికులకు తీరని ద్రోహం చేశారన్నారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ నిధికి రూ.1 కోటి విరాళం అందజేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తామన్నారు. కార్మికులు తమ ఓటును ఎమ్మెల్యే అభ్యర్థినైన తనకు గాజుగ్లాసు గుర్తుపైనా ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపైనా వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీవీఎస్ఎన్ ప్రసాద్, చల్లపల్లి శ్రీనివాస్, రంగా రమేష్, వెంకటరత్నం, భవన నిర్మాణ కార్మికులు, నాయకులు పాల్గొన్నారు.

కొవ్వూరు: కొవ్వూరులో ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఆధ్వర్యంలో తెలుగు మహిళలు ఇంటింటికీ వెళ్లి కూటమి మేనిఫెస్టోను బొట్టుపెట్టి వివరించారు. మున్సిపల్ మాజీ చైర్మన్ జొన్నలగడ్డ రాధారాణి 20వ వార్డులో ఇంటింటికీ వెళ్లి మహిళలకు కుంకుమ బొట్టు పెట్టి కూటమికి పట్టం కట్టాలని ప్రచారం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావుకు సైకిల్ గుర్తుపై, ఎంపీ అభ్యర్థి దగ్గుబాటి పురందేశ్వరికి కమలం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలన్నారు. కార్యక్రమంలో పొట్రు తులసీ ధనలక్ష్మి, గద్దె రేణుక, బర్ల శ్రీనివాస్, బోగవల్లి కుమారి, పాడుగుల రాణి, కె.నవ్య, కళ్యాణి, పద్మ, మద్దుకూరి సురేష్ పాల్గొన్నారు. తోగుమ్మి గ్రామంలో ముప్పిడి వెంకటేశ్వరరావు కుమారుడు ధరణ్ ఇంటింట ప్రచారం చేశారు. దొమ్మేరు, పంగిడి గ్రామాల్లో తెలుగు ప్రొఫెషనల్ వింగ్ ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రచారం చేశారు. స్టేట్ జనరల్ సెక్రటరీ కొండయ్యచౌదరి, నియోజకవర్గ అధ్యక్షుడు కిరణ్‌కుమార్, శ్రీనివాస్, గౌతమ్, భవాని శంకర్, భరత్‌తేజ, చైతన్య, మల్లిబాబు, నవీన్ పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవంలో ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, నామన బూరయ్య, జోడపాటి గంగరాజు, బోడపాటి కాశీ, తిగిరిపల్లి గోపి, ఆత్కూరి రాంబాబు, కైగాల శ్రీనివాస్, గొర్రెల శ్రీధర్ పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీలకు రాజకీయ గుర్తింపు

శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి



బీసీల సమావేశంలో పాల్గొన్న కుడుపూడి సత్తిబాబు

చాగల్లు, మే 1: బీసీలకు రాజకీయ గుర్తింపు ఇచ్చిన పార్టీ తెలుగుదేశం అని ఆ పార్టీ శెట్టిబలిజ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు అన్నారు. బుధవారం చాగల్లులో బీసీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు బీసీలకు 24శాతం రిజర్వేషన్‌లు కల్పించగా, చంద్రబాబు వాటిని 34శాతానికి పెంచి బీసీలు ఎంపీపీలు, సర్పంచ్‌లుగా పదవులు పొంది రాజకీయంగా ఎదిగేందుకు కృషి చేశారన్నారు. టీడీపీ మేనిఫెస్టోలోను బీసీలకు 10శాతం నిధులు కేటాయిస్తామని చెప్పడం అభినందనీయన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా బీసీలందరూ ఐకమత్యంతో పరినిచేయాలన్నారు. అందులో భాగంగా ఈ నెల 5న రాజమహేంద్రవరంలోని జేకే గార్డెన్స్ సమీపంలో సాయంత్రం 5గంటలకు శెట్టిబలిజ, గౌడ బీసీల ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసినట్టు కుడిపూడి సత్తిబాబు చెప్పారు. బీసీ వర్గాల వారందరూ హాజరై కార్యక్రమాన్ని మంచు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేతా సాహెబ్, టీడీపీ నాయకులు పిల్లి శ్రీనినవాసరావు, దొంగ రామకృష్ణ, కట్ట సత్యన్నారాయణ, దాసరి నాగేశ్వరరావు, ఆనెం చిన్న, సంసాని ప్రసాద్, జుత్తుక వీరకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

డీఎస్పీ రామారావు.. కొవ్వూరులో కేంద్ర బలగాల కవాతు



కొవ్వూరులో కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ బలగాలు

కొవ్వూరు, మే 1: ఎటువంటి ప్రలోభాలకు, బయాందోళనకు గురికాకుండా ప్రతిఒక్కరూ స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. బుధవారం కొవ్వూరులో శ్రీరామకాలనీ, రాజీవ్‌కాలనీ, మెరకవీది వాటర్‌ట్యాంకు సెంటర్ రౌండ్ పార్కు, అచ్చాయమ్మకాలనీ వరకు సీఐఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ కవాతులో పాల్గొని బలగాలకు సూచనలు చేశారు. సీఐ వి.జగదీశ్వరరావు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేందుకు కొవ్వూరుకు 86 మంది రాజస్తాన్ ఆర్మ్‌డ్ పోలీసులు వచ్చారన్నారు. ఎటువంటి భయం లేకుండా ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చి స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలనే లక్ష్యంతో కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు నియోజకవర్గాల్లో కేంద్ర బలగాల కవాతు నిర్వహించినట్టు చెప్పారు. ఎవరైనా ప్రలోభపెట్టినా, భయాందోళనకు గురిచేసినా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కవాతులో ఎస్ఐలు జుబేర్ మహమ్మద్, కె.సురేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

తుది విడత ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తి : సబ్ కలెక్టర్

సార్వత్రిక ఎన్నికల సందర్భంగా కొవ్వూరు అసెంబ్లీ సెగ్మెంట్‌కు సంబంధించి రెండో విడత (తుది విడత) ఈవీఎంల ర్యాండమైజేషన్ పూర్తిచేసినట్టు రిటర్నింగ్ అధికారి ఆశుతోష్ శ్రీవాస్తవ తెలిపారు. బుధవారం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు, బ్యాలెట్, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాడ్స్, ర్యాండమైజేషన్ కార్యక్రమాన్ని నియోజకవర్గ పరిశీలకులు, పలు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించామన్నారు. నియోజకవర్గంలోని 176 పోలింగ్ కేంద్రాలకు 211 బ్యాలెట్ యూనిట్లు, 211 కంట్రోల్ యూనిట్లు, 228 వీవీ ప్యాడ్‌లను కేటాయించామన్నారు.

ఎస్ఈబీ దాడుల్లో 34 మంది అరెస్టు

కొవ్వూరు, మే 1: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఏప్రిల్ నెలలో ఎస్ఈబీ దాడులు నిర్వహించి 34 కేసులు నమోదు చేసి 34 మందిని అరెస్టు చేసి, 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామని, 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ సీఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. 188 మద్యం సీసాలను, 223 బీరు సీసాలను స్వాధీనం చేసుకున్నామని, 50 మంది పాత నేరస్తులను తహశీల్దార్ కోర్టులో బైండోవర్ చేశామన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అన్ని వర్గాలకు న్యాయం

● టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు అభ్యర్థి దుర్గేష్



పెరవలి: కానూరు అగ్రహారంలో పర్యటిస్తున్న కందుల దుర్గేష్

పెరవలి, మే 1: రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలకు న్యాయం జరగాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావాలని టీడీపీ-జనసేన-బీజేపీ నిడదవోలు నియోకజకవర్గ కందుల దుర్గేష్ అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా కానూరు అగ్రహారంలో పర్యటించారు. గ్రామంలో ఆయనకు కార్యకర్తలు, అభిమానులు అపూర్వ స్వాగతం పలికారు. పలువురు మహిళలు హారతులిచ్చారు. ఈ సందర్భంగా దుర్గేష్ మాట్లాడుతూ రైతులు, మహిళలు కార్మికులు, విద్యార్థులు వృద్ధులు, వివిధ చేతి వృత్తి పనులు వారందరికీ న్యాయం జరిగే విధంగా ఉమ్మడి మేనిఫెస్టో విడుదల చేశారని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావాలన్నారు. ఎంపీ అభ్యర్థి పురందేశ్వరికి కమలం గుర్తు పైన, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు గాజు గ్లాస్ గుర్తు పైన ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు, జనసేన కోఆర్డినేటర్ బోగవల్లి ప్రసాద్, అతికాల శ్రీను, పిప్పర రవి, అబ్బిశెట్టి సత్తిరాజు, దాసం నాయుడు, హనుమంతు సుబ్రహ్మణ్యం, హరిదాసు చిన్న, దాసం మాణిక్యం పాల్గొన్నారు.

మీ ఓటుతో గెలిపించండి

నిడదవోలు, మే 1: ఎన్నో ఎన్నికల్లో తన ఓటు హక్కును వినియోగించుకున్న సీనియర్ సిటిజన్, పట్టణ ప్రముఖుడు వ్యాపారవేత్త రొంగల రాముడు. ఆయన ప్రస్తుత వయస్సు 104 ఏళ్లు. బుధవారం నిడదవోలులోని ఆయన స్వగృహంలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి కందుల దుర్గేష్ కలిశారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం తనకు ఓటు వేసి గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. దీనిపై రాముడు.. అఖండ విజయంతో గెలుపొందాలని, నియోజక వర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడపాలని దుర్గేష్‌ను ఆశీర్వదించారు.



నిడదవోలులో పెద్దాయన రాముదుని కలిసిన దుర్గేష్

అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు

నల్లజర్ల, మే 1: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దు చేసి రైతుల భూమి రైతులే విక్రయించుకునే వెసులబాటు కల్పిస్తామని ఎమ్మెల్యే అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. బుధవారం పోతవరం, సుభద్రపాలెంలో ఎన్నికల ప్రచారం టీడీపీ సీనియర్ నాయకుడు పసుమర్తి రతీష్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ మీ భూమి మీది కాదు ఎవరైనా వచ్చి నాదంటే అంతే సంగతులు ఇదే జగన్ తెచ్చిన భూ యాజమాన్య హక్కు చట్టం అని అన్నారు. రైతులు భూ విక్రయాలు చేసుకున్నా ఒరిజినల్ డాక్యుమెంట్లు ఇవ్వరని, కేవలం జిరాక్ పేపర్లు అందించి ఇంటికి పంపిస్తారన్నారు. కబ్జాకోర్లకు, అక్రమార్కులకు ఊతమిచ్చేలా తయారు చేసిన చట్టం ఇంకా అమలు కాలేదని వైసీపీ పెద్దలు అచ్చోసిన అబద్దాలు చెబుతున్నారని మండిపడ్డారు. అలాగే ఉమ్మడి కూటమి ఉమ్మడి మేనిఫెస్టో అన్ని వర్గాలను ఆకట్టుకునేలా ఉందన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ ముళ్ళపూడి బాపిరాజు, జనసేన కన్వీనర్ దొడ్డిగర్ల సువర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ ఉచిత శిక్షణ శిబిరం

● అసోసియేషన్ అధ్యక్షుడు హరిచరణ్

కొవ్వూరు, మే 1: గౌతమి స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అవంతీ ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి ఇంద్రకుమార్ ఆర్థిక సహకారంతో మే 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వాలీబాల్ వేసవి ఉచిత శిక్షణా శిబిరం నిర్వహిస్తున్నట్టు అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి హరిచరణ్ తెలిపారు. పట్టణంలోని ఇందిరమ్మకాలనీ ఎన్టీఆర్ స్టేడియంలోని వాలీబాల్ గ్రౌండ్స్‌లో ప్రతిరోజు ఉదయం 6నుంచి 8గం., సాయంత్రం 4:30నుంచి 6-30 గం. వరకు శిక్షణ అందిస్తున్నట్టు చెప్పారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రంతో హాజరు కావాలన్నారు.

కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు

దేవరపల్లి, మే 1: దేవరపల్లిలో జడ్పీ హైస్కూల్లో బుధవారం కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్టులు నిర్వహించారు. పలు విభాగాల్లో మొత్తం 38 మంది విద్యార్థులు పాల్గొన్నారని కరాటే ఇన్‌స్ట్రక్టర్ జక్కంశెట్టి శ్రీనివాస్ తెలిపారు. ఈ కరాటే శిక్షణలో పలు రకాల బెల్టులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కరాటే ఇండియన్ చీఫ్ ఎగ్జామినర్, కరాటే మాస్టర్ కేతా శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

గాజు గ్లాస్ పోయి గ్యాస్ సిలిండర్ వచ్చే..

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి) రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసున్న మేడా శ్రీనివాస్ మొదట పోరాడి గాజుగ్లాస్ గుర్తు తెచ్చుకున్న సంగతి తెలిసిందే. కానీ ఎన్నికల కమిషన్ ఈ గుర్తును జనసేనకు కేటాయించింది. దీంతో రాజమండ్రి లోక్‌సభ పరిధిలో ఓటర్లు అయోమయ పరిస్థితిని ఎదురుకొంటారనే కారణంతో జనసేన కోర్టుకు వెళ్లింది. వారి వాదనను అంగీకరించిన కోర్టు జనసేన పోటీ చేసే పార్లమెంట్ పరిధిలో ఇతరులు ఎవరికీ గాజుగ్లాస్ గుర్తు కేటాయించవద్దని హైకోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులు మేడా శ్రీనివాస్ గాజుగ్లాస్‌కు బదులు గ్యాస్ సిలెండర్ గుర్తు కేటాయించారు. దీంతో జనసేన శ్రేణులు ఊపిరి పీల్చుకున్నాయి.

ప్రజలకు చేరువగా కాంగ్రెస్ మేనిఫెస్టో

రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు



సమావేశంలో మాట్లాడుతున్న గిడుగు రుద్రరాజు

రాజమహేంద్రవరం సిటీ, మే 1: రాష్ట్రంలో ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ప్రజలకు చేరువగా వెళ్లిందని ఆ పార్టీ రాజమహేంద్రవరం ఎంపీ అభ్యర్థి గిడుగు రుద్రరాజు అన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో గిడుగు రుద్రరాజు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజా, కాంగ్రెస్ పార్టీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి బోడా వెంకట్, రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రుద్రరాజు, రామకృష్ణ మాట్లాడుతూ దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలంటే రాజ్యాంగాన్ని రక్షించుకోవాలన్నారు. 28 పార్టీలు కలిపి ఇండియా కూటమిగా ఏర్పడ్డాయన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి 200 సీట్లు కూడా వచ్చే అవకాశాలు లేవన్నారు. భారత దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలంటే ఇండియా కూటమి అధికారంలోకి రావాలన్నారు. రాష్ట్రంలో ఉన్న అధికార ప్రతిపక్ష పార్టీలు మోది కనుసన్నల్లోనే నడుస్తున్నాయని, వాటిని గెలిపిస్తే బీజేపీని గెలిపించినట్లేనన్నారు.ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తి, విశాఖ ఉక్కును పరిరక్షించడం, ఎల్ఐసీని ప్రైవేట్ పరం కాకుండా కాపాడడం, నిరుద్యోగ సమస్యను తీర్చడం ఇండియా కూటమితోనే సాధ్యమన్నారు.

సంతకాల పోర్జరీ కేసులో ఇద్దరి అరెస్టు

తాళ్లపూడి, మే 1: సంతకాల పోర్జరీ, నకిలీ ధ్రువపత్రాలు, నకిలీ దస్తావేజులతో సుమారు రెండెకరాల భూమిని ఆక్రమంగా రిజిస్ట్రీ చేయించుకున్న కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ శ్యాంసుందర్ తెలిపారు. కొవ్వూరుకు చెందిన గన్నిపూడి సూర్యగణేష్ భార్య శ్రీదేవి ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం.. తన తాత మేన్ని వెంకన్న ఆస్తిని ఆయన తదనానంతరం పంచుకోవలసిన ఉంది. అయితే తన తాత 2012లో చనిపోయారని, కానీ 2001లోనే చనిపోయినట్టు నకిలీ మరణ ధ్రువీకరణ పత్రం సృష్టించి తన ఆస్తిని కాజేసి పాస్‌పుస్తకాలు కూడా పొందారని పేర్కొన్నారు. అన్నదేవరపేటకు చెందిన మేన్ని చంద్రమోహన్, కొండేపూడికి చెందిన పినిశెట్టి మంగతాయారు ఇంకా ఆరుగురు పోర్జరీ వ్యవహారంలో ఉన్నారన్నారు. శ్రీదేవి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసి మేన్ని చంద్రమోహన్, పినిశెట్టి మంగతాయారులను అరెస్టు చేసి కోర్టుకు తరలించగా 10 రోజులు రిమాండ్ విధించినట్టు ఎస్ఐ శ్యాంసుందర్ తెలిపారు.

వేగేశ్వరపురంలో ముగిసిన మేరీమాత ఉత్సవాలు

తాళ్లపూడి, మే 1: వేగేశ్వరపురంలో గోదావరి తీరంలోని నిత్య సహాయ గోదావరి మేరీమాత ఆలయం వద్ద నిర్వహిస్తున్న ఉత్సవాలు మంగళవారం రాత్రి ముగిసాయి. ఫాదర్ టి.జాన్ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో పలువురు ఫాదర్లు విచ్చేసి స్వస్థత ప్రార్థనలు జరిపారు. మధుర గీతాలు ఆలపించారు. ఆఖరి రోజు కార్యక్రమానికి విచ్చేసిన ఫాదర్ బాబూజార్జ్ చాన్సలర్, నిర్మలగిరి మేరీమాత ఆలయ డైరెక్టర్ ఫాదర్ జాన్‌పీటర్‌లను సత్కరించారు. తోటి ఫాదర్‌లను గౌరవించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.